


# విజయభాను




విశాఖపట్నం, శుక్రవారం 02-03-2018 VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION సంపుటి : 41 సంచిక : 168 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## జయేంద్ర సరస్వతి
# మహాసమాధి



కంచి: కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి బృందావన ప్రవేశం చేశారు. మహాభిషేకం అనంతరం మంత్రోచ్ఛరణల మధ్య బృందావన ప్రవేశం చేశారు. శివైక్యం చెందిన కంచి పీఠాధిపతి లిఖితాన్ని భక్త్య శిష్యకోటి వేదమంత్రాల మధ్య జయేంద్ర సరస్వతి బృందావన ప్రవేశం చేశారు. మఠంలో నిత్యం భక్తులకు ఆశీస్సులు అందజేసిన ప్రాంతం స్వామి చంద్రశేఖరేంద్ర సరస్వతి బృందావనం పక్కనే జయేంద్ర సరస్వతి బృందావన ప్రవేశం చేశారు.

కొంతకాలంగా రక్తపోటు, తీవ్ర మధుమేహం, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న జయేంద్ర సరస్వతి శివైక్యం అశేష భారతావనిని శోకసంద్రంలో ముంచేసింది. జయేంద్ర సరస్వతి మహానిర్యాణంతో కంచిమఠం నిర్వాహకులు, శిష్యులు కన్నీటి పర్యంతమయ్యారు. బృందావన ప్రవేశానికి ముందు జయేంద్ర సరస్వతికి మహాభిషేకం, ఉత్తర్రకియలు నిర్వహించారు. ఉత్తర పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి. జయేంద్ర సరస్వతిని చివరిసారిగా దర్శించుకునేందుకు ప్రముఖులు, వేలాది మంది భక్తులు మఠానికి తరలివెళ్లారు. ఎన్నిసార్లు తమకు ఆశీస్సులు అందజేసిన జయేంద్ర సరస్వతిని కడసారి దర్శనం చేసుకున్నారు.

గురువారం ఉదయం 7గంటల వరకు జయేంద్ర సరస్వతికి భక్తులు అంజలి ఘటించారు. ఆ తరువాత జయేంద్ర సరస్వతి స్వామి ముక్తికి వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాయి 2లో



## తెలంగాణలో పార్టీ బలోపేతంపై నేతలకు
# దిశానిర్దేశం

- పల్లెపల్లెకు తెలుగుదేశం కార్యక్రమాన్ని విస్తృతం చేయాలి
- త్వరలోనే ఖమ్మంలో భారీ బహిరంగసభ నిర్వహించాలి
- పొత్తుల అంశంపై లేనిపోని ఊహాగానాలొద్దు
- టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయడానికి రాష్ట్ర నాయకత్వం పటిష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలని పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు సూచించారు. రెండోరోజు తెలంగాణ తెదేపా పొలిట్ బ్యూరో, కేంద్ర కమిటీ సభ్యులతో చంద్రబాబు హైదరాబాద్‌లోని తన నివాసంలో సమావేశమయ్యారు. దాదాపు గంటన్నర పాటు పార్టీ నేతలతో సమావేశమైన బాబు... తాజా పరిణామాలపై దిశా నిర్దేశం చేశారు. పల్లెపల్లెకు తెలుగుదేశం కార్యక్రమాన్ని మార్చి 29 వరకు విస్తృతంగా కొనసాగించాలని బాబు పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకత్వం స్వయంగా ప్రజల్లోకి వెళ్తే కార్యకర్తల్లో ధైర్యం వస్తుందని... త్వరలోనే ఖమ్మంలో భారీ బహిరంగసభకు తాను హాజరవుతానని బాబు చెప్పారు. మహానాడులోపు మూడు బహిరంగ సభలు నిర్వహించాలని నేతల సూచనకు బాబు అంగీకారం తెలిపారు. పొత్తుల అంశం కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే మాట్లాడు కుందామన్న బాబు... ప్రస్తుతం పార్టీ బలోపేతం అంతా దృష్టి సారించాలని చెప్పారు. రెండు రాష్ట్రాల్లో పార్టీకి అండగా ఉంటానన్న బాబు... కొందరు నాయకులు పార్టీని తరువాయి 2లో

# నీరవ్ మోదీ మామ ఛోక్సీ ఆస్తులు జప్తు

## పిఎన్‌బిలో వెలుగుచూసిన మరో కుంభకోణం



దిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకులో భారీ కుంభకోణం నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కుంభకోణంలో ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీతో పాటు ఆయన మామ, గీతాంజలి జెమ్స్ అధినేత మెహుల్ ఛోక్సీకి సంబంధం ఉన్న సంగతి తెలిసిందే. ఈ కేసులో ఛోక్సీకి చెందిన రూ.1200కోట్ల విలువైన 41 ఆస్తులను ఈడీ జప్తు చేసింది. స్వాధీనం చేసుకున్న ఆస్తుల్లో ముంబయిలోని 15 ఫ్లాట్లు, 17 కార్యాలయ ప్రాంతాలు ఉన్నాయి. కోల్‌కతాలో ఓ మాల్, అలీబాగ్‌లో నాలుగు తరువాయి 2లో

## నేటినుంచి ఐదు రాష్ట్రాల్లో
# సినిమాలు బంద్



హైదరాబాద్: డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ల తీరును నిరసిసూ నేటి నుంచి ఐదు రాష్ట్రాల్లో సినిమా థియేటర్ల బంద్ పాటించాలని దక్షిణాది రాష్ట్రాల సినిమా నిర్మాతల మండలి నిర్ణయించింది. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, కేరళలో థియేటర్లను బంద్ చేస్తున్నట్టు సురేష్‌బాబు గురువారం వెల్లడించారు. గురువారం దక్షిణాది నిర్మాతల మండలి ఐకాస సమావేశమైంది. అనంతరం ఐకాస ఛైర్మన్ సురేష్ బాబు తరువాయి 2లో

# ముగిసిన జల జగడం




అమరావతి: ఏపీ, తెలంగాణ మధ్య ఏర్పడిన నీటి వివాదం ముగిసింది. ఈ గొడవపై కృష్ణా రివర్ బోర్డు జోక్యం చేసుకొని పరిష్కారం చూపింది. ఏపీ డిమాండ్ ప్రకారం మరో 5 రోజుల పాటూ రోజుకు 2వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. నీటి విడుదలపై ఇరు రాష్ట్రాల మధ్య మళ్లీ వివాదం ఏర్పడింది. సాగర్ కుడి కాలువకు తెలంగాణ అధికారులు నీటిని నిలిపివేశారు.దీంతో తమ వాటా పూర్తవ్వకుండా నీటిని నిలిపివేయడంపై ఏపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. కుడి కాలువకు వెంటనే నీటిని విడుదల చేయాలని ఏపీ అధికారులు డిమాండ్ చేశారు.

సాగర్ నుంచి ఆంధ్రకు 10.5 టీఎంసీల నీటిని కృష్ణా బోర్డు కేటాయించింది, అయితే ఇప్పటి వరకు 10.2 టీఎంసీల నీరు విడుదలవగా... మరో 0.3 టీఎంసీలు నీరు విడుదల కావాల్సి ఉంది. అయితే ఆ నీటిని విడుదల చేయకుండానే తెలంగాణ కుడి కాల్వకు నీటిని నిలిపి వేయడం ఏంటని ఏపీ ప్రశ్నించింది. ముందు జాగ్రత్తగా డ్యామ్ దగ్గర ఇరు రాష్ట్రాల పోలీసులు భారీ సంఖ్యలో మోహరించారు. అయితే చివరికి కృష్ణా రివర్ బోర్డు జోక్యం చేసుకొని పరిష్కారం చూపించడంతో వివాదం సద్దుమణిగింది.

## ప్రముఖ రచయిత
# నాయని కృష్ణమూర్తి కన్నుమూత

**బొమ్మరిల్లు, విజయ, నీలిమ పత్రికలకు ఉపసంపాదకుడు**
**తెలుగు సాహిత్య సేవలకు జీవనసాఫల్య పురస్కారం**
**పలు చిత్రాలకు నేపథ్య గీత రచయిత**
**నాయని మృతి సాహితీ లోకానికి తీరని లోటు**
**సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి**



బెంగళూరు: ప్రముఖ రచయిత నాయని కృష్ణమూర్తి గురువారం ఉదయం కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బెంగళూరు లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. అనేక నవలలు, కథలు, ఆధ్యాత్మిక గ్రంథాలను ఆయన రచించారు. చిత్తూరు జిల్లా నడిమిచెర్లలో 1951లో తరువాయి 2లో

# టాటా ట్రస్టు సహకారం మరువలేనిది

- టాటా ప్రధాన కార్యాలయం ఇక్కడే
- టీ-ఐటీ శాఖ మంత్రి కేటీఆర్



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వానికి టాటా ట్రస్టు అందిస్తున్న సహకారం మరువలేనిదని తెలంగాణ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. క్యాన్సర్ నియంత్రణపై టాటా ట్రస్టుతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు నోవాటెల్ హోటల్‌లో ఇరువర్గాల ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. తరువాయి 2లో




# ప్రత్యేక హోదాపై వెనక్కి తగ్గేది లేదు

**13 జిల్లాల కలెక్టరేట్‌ల వద్ద వైకాపా మహా ధర్నా**
**ఉధృతంగా వైఎస్‌ఆర్‌సీపీ కలెక్టరేట్‌ల ముట్టడి**
**కేసులకు భయపడి హోదా తాకట్టు పెట్టారు**
**బాబుకు చిత్తశుద్ధి ఉంటే బయటకు రావాలి**
**ఏపీ ప్రజల కోసం రాజీనామా బాటపడతా**
**ధర్నాలో పాల్గొన్న వైకాపా నేతలు**



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంజీవని అయిన ప్రత్యేక హోదా సాధన కోసం గురువారం ఏపీలోని 13 జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ముందు వైఎస్సార్ కాంగ్రెస్ ధర్నా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. హోదా సాధన కోసం దశల వారీగా ఆందోళనను మరింత ఉధృతం చేయడంలో భాగంగా పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పార్టీ శ్రేణులు రంగంలోకి దిగాయి. ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అంటూ అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద నినాదాలు చేస్తున్నారు. ఆయా జిల్లాల్లో పార్టీ అధ్యక్షులు, అసెంబ్లీ సమన్వయకర్తలు క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఈ ధర్నాల్లో వైఎస్‌ఆర్‌సీపీ నేతలు, కార్యకర్తలు ముమ్మరంగా పాల్గొన్నారు.

**కేసులకు భయపడి హోదా తాకట్టు పెట్టిన చంద్రబాబు**

కేంద్రం ఎలా ఆడిస్తే చంద్రబాబు అలా ఆడుతున్నారని వైఎస్‌ఆర్‌సీపీ ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వేంకటేశ్వర్లు మండిపడ్డారు. ఓటుకు కోట్లు కేసుకు భయపడి ప్రత్యేక హోదాను తాకట్టుపెట్టిన వ్యక్తి చంద్రబాబు అని, రోజుకో రకంగా మాట్లాడుతూ ఏపీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని చంద్రబాబు తీరును విమర్శించారు. ప్రత్యేక హోదా ఏపీ ప్రజల హక్కు అంటూ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యేలు ఆళ్ల రామకృష్ణారెడ్డి, ముస్తఫా, కోన రఘుపతి, గోపిరెడ్డి నివాసరెడ్డి, జంగా కృష్ణమూర్తి, పలువురు నేతలు, కార్యకర్తలు గుంటూరు కలెక్టరేట్ వద్ద నినాదాలు చేశారు.

**ప్రత్యేక హోదాపై వెనక్కి తగ్గేది లేదు**

ప్రత్యేక హోదా ఏపీ ప్రజల హక్కు అని, హోదా విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని వైఎస్‌ఆర్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. హోదా తరువాయి 2లో

# విశ్రాంత జీవితం ఆనందంగా, ఆరోగ్యంగా గడపండి

### జి.వి.ఎం.సి. కమిషనర్ హరినారాయణన్

విశాఖపట్నం: జి.వి.ఎం.సి.కి అనేక సంవత్సరాలు సేవలందించి బుధవారం రిటైర్ అయిన అధికారులు, సిబ్బంది విశ్రాంత జీవితాన్ని ఆనందంగా, ఆరోగ్యంగా గడపాలని కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. కాన్ఫరెన్స్ హాల్‌లో మూడవ జోన్‌కు చెందిన సీనియర్ సహాయకులు కె.రాధాకృష్ణారెడ్డి, రెండవ జోన్‌కు చెందిన ఇంజినీరింగ్ విభాగం ఏ.టి.ఓ. ఎన్.పద్మనాభరాజు, మూడవ జోన్ ప్రజారోగ్య విభాగ పబ్లిక్ హెల్త్ వర్కర్లు ఆర్.విజయ, ఆర్.కనక మహాలక్ష్మిల సేవలను ప్రశంసిస్తూ సన్మానించారు. కార్యక్రమానికి అదనపు కమిషనర్ (జనరల్) జి.వి.వి.ఎస్.మూర్తి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో గ్రేటర్ విశాఖ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎం.ఆనందరావు, వివిధ శాఖల అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ సర్వేక్షణ్ ప్రజాభిప్రాయ సేకరణకు ప్రాధాన్యత ఇవ్వండి

### అదనపు కమిషనర్ (జనరల్) జి.వి.వి.ఎస్. మూర్తి

విశాఖపట్నం: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకు సాధనకు 1969 నెంబర్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎడిసి (జెన్) జి.వి.వి.ఎస్.మూర్తి పేర్కొన్నారు. కాన్ఫరెన్స్ హాల్‌లో జోనల్ కమిషనర్లు, ఎ.ఎం.ఓ.హెచ్‌లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లతో స్వచ్ఛ సర్వేక్షణ్ ప్రజాభిప్రాయంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వ్యక్తి అభిప్రాయ సేకరణకు ప్రాధాన్యతనిచ్చి లక్ష్యాన్ని సాధించాలని అభిలషించారు. మార్చి 10వ తేదీతో పూర్తవుతున్నందున అనుకున్న లక్ష్యం పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వై.మంగపతిరావు, ఏడిసిలు ఎస్.ఎస్.వర్మ, సకలారెడ్డి, యుసిడి పిడి డి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కాలువ పనులకు శంకుస్థాపన



కంచరపాలెం: 37 వార్డు పరిధిలో గల గణేష్ నగర్ గ్రామంలో గురువారం రూ.15,00,000/- విలువగల పెద్ద కాలువల పునః నిర్మాణము పనులు అనగా జగజీవన్ నగర్ మరియు పెద్ద కొత్తూరు గ్రామాలను కలుపుతూ పోతున్న పెద్ద కాలువల పునః నిర్మాణము కొరకు స్థానిక ఎమ్మెల్యే పెనుమత్స విష్ణుకుమార్ రాజు , 37వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గంకల అప్పారావు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటింటికి తెలుగుదేశంలో భాగంగా ఈ గ్రామంలో పర్యటించినపుడు గ్రామ ప్రజలు ఆయన దగ్గర వారికి గల ముఖ్య సమస్య పెద్ద కాలువల పునః నిర్మాణము పనులు అని తెలియజేయగా ఆయన వెంటనే స్పందించి సమస్యని రాత పూర్వకంగా స్థానిక ఎమ్మెల్యే పెనుమత్స విష్ణుకుమార్ రాజు దృష్టికి మరియు జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా అది ఇపుడు మంజూరు జరిగి శంకుస్థాపన చేస్తున్నారని తెలియజేసారు అని ఇందుకు వార్డు ప్రజల తరుపున మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు స్థానిక ఎమ్మెల్యే పెనుమత్స విష్ణుకుమార్ రాజుకి, జీవీఎంసీ అధికారులకి ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జన్మభూమి కమిటీ సభ్యులు రొంగలి మహేశ్వర రావు స్థానిక నాయకులు, రాజు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### చిట్టివలసలో

# దుర్గాదేవి ఆలయం ప్రారంభం



భీమునిపట్నం : భీమిలి డివిజన్ చిట్టివలసలో నూతనంగా నిర్మించిన దుర్గాలయం ప్రారంభోత్సవం కు ముఖ్య అతిదిగా గంటా ప్రతినిది విజయబాబు పాలుగున్నారు.అనంతరం తగరపు వలస లోని సాయిబాబా గుడి దగ్గర జరిగిన అన్న సమారాధన కార్యక్రమంను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమీటి ఛైర్మన్ కోరాడ నాగభూషణరావు, ఎం.పి.పి.యరబాల.క్రిష్ణవేణి, అనిల్ ప్రసాద్, తగరపువలస,భీమిలి డివిజన్ అద్యక్షులు కొప్పల.రమేష్ ,గంటా.నూకరాజు,జిల్లా రూరల్ తెలుగు మహిళా అద్యక్షురాలు కురుమిన లీలావతి, కొప్పల కృష్ణ,రవ్వ వెంకటరావు, జన్మభూమి కమీటి సభ్యులు పాల్గొన్నారు.

### పుర సేవా యాప్ ద్వారా

# పన్నులు చెల్లింపు చేయవచ్చు

భీమునిపట్నం : భీమిలి జోనల్ కార్యాలయం లో విలేకరులతో జోనల్ కమిషనర్ బి.సన్యాసి నాయుడు మాట్లాడుతూ భీమిలి జోనల్ పరిధి లో ఇంటి పన్నులు, ఖాళీస్థానం పన్నులు, నీటి చార్జీలు, ఇకమీదట మీ యొక్క ఎంద్రేడ్డ్ మొబైల్ లో పుర సేవా ఎప్ ద్వారా గాని జోనల్ కార్యాలయం లో గాని మీ సేవా ద్వారా గాని పన్నులు చెల్లించ వచ్చని ఆయన అన్నారు.ఇంకా పన్నులు చెల్లించని వారికి రెండు శాతం విధించి జప్తు నోటిసులు జారీ చేసి ఇంటికీ ఉన్న కొళాయి కనెక్షన్ సిబ్బంది వచ్చి తొలగిస్తారని అన్నారు.పన్నులు సకాలం లో చెల్లించి మహా విశాఖ నగపాలక సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన అన్నారు.

## జె.నాయుడుపాలెం రహదారికి మహర్ధశ

రోలుగుంట: మండలంలోని జె.నాయుడిపాలెం రహదారికి ఎట్టకేలకు మహర్ధశ పట్టింది. సుమారు రూ.2.49 కోట్లతో ఈ రహదారి ఆధునికీకరణ పనులకు శ్రీకారం చుట్టారు. దీని వల్ల నర్సీపట్నం చోడవరం నియోజకవర్గాలకు చెందిన పలు గ్రామాల ప్రజలు అవస్థలు తొలగనున్నాయి. మాకవరపాలెం మండలం తూటిపాల నుంచి రోలుగుంట మండలం జె.నాయుడుపాలెం మీదుగా రావికమతం మండలం కొత్తకోట వరకు ఉన్న తారురోడ్డు అధ్వాన్నంగా తయారైంది. ఈ రహదారి పరిస్థితిని ఎమ్మెల్యే రాజు మంత్రి అయ్యన్నపాత్రుడి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన చొరవతో ఏపిడిఆర్పీ నుంచి రూ.2.49 కోట్లు కేటాయించారని పంచాయతీ రాజ్(ప్రాజెక్టు) డిఈఈ గోపినాధ్ తెలిపారు. ఇందులో నాయుడుపాలెం తూటిపాల వరకు వంతెనతో పాటు నూతనంగా తారురోడ్డు ఏర్పాటు చేయడం, అలాగే జె.నాయుడుపాలెం నుంచి కొత్తకోట వరకు తారురోడ్డుకి మరమ్మత్తు పనులు ఉంటాయని డిఇఇ తెలిపారు. ప్రస్తుతం పనులు శరవేగంగా జరుపుతున్నారు. ఈ పనులు త్వరలోనే పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

## యలమంచిలి ఎక్సైజ్ సిఐగా పల్లవి

యలమంచిలి రూరల్ : యలమంచిలి సర్కిల్ ఎక్సైజ్ సిఐగా ఎల్‌కె.పల్లవి విధుల్లో చేశారు. ఇక్కడ పని చేస్తున్న సిఐ జయరావిరెడ్డిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేయడంతో ఆయన స్థానంలో ఈమెను నియమించారు. విశాఖ టాస్క్‌పోర్సులో పని చేస్తున్న పల్లవిని బదిలీపై ఇక్కడ నియమించారు.

### చెట్టుకొమ్మవిరిగిపడి

# ఇద్దరు కూలీలు మృతి

- భవన నిర్మాణానికై స్థలం చదును
- మృతునికి భార్య, పిల్లలు
- సిఐ స్వామి నాయుడు కేసు దర్యాప్తు



పరవాడ: మండల కేంద్రమైన పరవాడ సినిమా హల్ జంక్షన్‌లో చెట్టు కొమ్మ విరిగి పడి ఇద్దరు కూలీలు అక్కడికక్కడే మృతి చెందారు. దీనికి సంబందించి పరవాడ సిఐ స్వామి నాయుడు తెలిపిన వివరాలు ప్రకారము పరవాడ సబ్ స్టేషన్ నుండి పరవాడ సినిమా హాల్ జంక్షన్ మధ్యలో సిండ్‌కేట్ బ్యాంక్ ఎదురుగా జాతీయ రహదారిని అనుకొని నాలం రమణ అనే వ్యక్తికి సంబందించిన ఒక స్దలం కలదు. దీనిని నిర్మాణాల పని నిమిత్తము మట్టి తవ్వడానికి పరవాడ గ్రామానికి సంబందించిన పైల అప్పారావు భార్య అక్కులమ్మ, కుమారుడు, కుమార్తె గలరు. అదే గ్రామానికి చెందిన బండారు అప్పారావు భార్య సత్యవమ్మ వీరికి ఇద్దరు కుమారులు ఒకరు కుమార్తె గలరు. వీరు ఇద్దరు నాలం రమణ స్దలంలో మట్టి తవ్వడానికి రెండు రోజులు నుంచి కూలీ పనులు చేస్తున్నారు. అస్థలంలో వున్న ఎండి పోయిన వేపచెట్టును రొంగలి సూర్య నారాయణ, కర్రి గౌతమ్ సహయంతో చెట్టు మెదలు గొడ్డలితో నరికిన తర్వాత చెట్టు నేలపై పడటానికి చెట్టును త్రాడుతో కట్టి కూలీలైన పైల అప్పారావు, బండారు అప్పారావు, కర్రి గౌతమ్ త్రాడు లాగుతుండగా చెట్టును రొంగలి సూర్యనారాయణ, నాలం రమణ చెట్టును తోస్తుండగా అ చెట్టును లాగుతున్న పైల అప్పారావు, బండారు అప్పారావు తలపై చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. వారు ఇద్దరు అక్కడికిఅక్కడే మృతి చెందారు. కర్రి గౌతమ్ తప్పించుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న పరవాడ పోలీసులు సంఘటన స్దలాన్ని చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వైభవంగా సంపత్ వినాయకస్వామి ఆలయ నవమ వార్షికోత్సవం



గాజువాక: శ్రీ నగర్ అఫీషియల్ కాలనీలో గల శ్రీ సిద్ధి బుద్ధి సమేత సంపత్ వినాయక స్వామి ఆలయ నవమ వార్షికో త్సవం గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఉదయం సంపత్ వినాయకస్వామివారి కళ్యాణ మహొత్సవం జరుగుతుందని ఆలయ ప్రధానార్చకులు బ్రహ్మశ్రీ జాడ శ్రీనివాసశర్మ, ఆలయ కమిటీ ప్రతినిధులు ఏ.లక్ష్మణ్ రావు, సత్తి శ్రీనివాసరెడ్డి, మహాలక్ష్మినాయుడు, కె.వి.రమణరెడ్డి తెలిపారు. మధ్యహ్నాం అన్నసమారాధన కార్యక్రమం జరుగుతుందని, సాయంత్రం 4గం.లకు ఆలయం వద్ద నుంచి కళ్యాణ ఉత్సవ మూర్తుల తిరువీధి, ఉక్కు నగరం శ్రీ వెంకటేశ్వర భక్త భజన మండలి ఎస్.ఎల్.పి.రావు బృందంచే కోలాట ప్రదర్శన ఉంటుందని కమిటీ ప్రతినిధులు తెలిపారు. ప్రతి ఏడాది వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## సత్యనారాయణస్వామి గుడికి రక్షణ గోడ, రోడ్డు నిర్మాణం



విశాఖపట్నం: ఇసుకకొండ సత్యనారాయణ స్వామి గుడి రక్షణ గోడ నిర్మాణం పొడిగింపు, సిమెంట్ కాంక్రీట్ రోడ్డు నిర్మాణాన్ని రూ.7 కోట్ల అంచనాతో నిర్మించనున్నట్లు రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాస రావు పేర్కొన్నారు. గురువారం ఇసుక కొండపై గల సత్యనారాయణ స్వామి ఆలయానికి రక్షణ గోడ పొడగింపునకు శంకుస్థాపన గావించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తమ నాణ్యతా ప్రమాణాలు పాటించి ఆరు నెలల్లో పనులు పూర్తి చేయాలని పేర్కొన్నారు. నిర్మాణానికి విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ రూ. 3 కోట్లు, జివిఎంసి రూ. 4 కోట్లు అందజేసి సంయుక్తంగా నిర్మాణం చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భక్తుల సౌకర్యార్థం రోడ్డు, డ్రెయిన్, నడక మార్గం పునరుద్ధరణ, రక్షణ గోడ నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో విశాఖ దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యుడు వాసుపల్లి గణేష్ కుమార్, పెందుర్తి శాసనసభ్యుడు బండారు సత్యనారాయణ, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, జి.వి.ఎం.సి. కమిషనర్ హరినారాయణన్, పోర్టు డిప్యూటీ ఛైర్మన్ పి.ఎల్.హరినాథ్, ఇ.ఇ.గణేష్, జోనల్ కమిషనర్ చిట్టిబాబు, ఎ.ఎం.ఓ.హెచ్. డాక్టర్ సుధాకర్, డిఇలు రమేష్, కృష్ణకుమార్, శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయ ధర్మకర్తల మండలి సభ్యులు, కార్యనిర్వహణాధికారి, స్థానిక నాయకులు పాల్గొన్నారు. తొలుత మంత్రి గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మొదటి పేజీ తరువాయి

## నేటినుంచి ఐదు రాష్ట్రాల్లో సినిమాలు బంద్

మీడియాతో మాట్లాడారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన మీడియాకు వెల్లడించారు. ఐదు రాష్ట్రాల నిర్మాతల మండలి సంయుక్తంగా ఐకాస ఏర్పాటు చేసుకున్నామని ఆయన చెప్పారు. ఆంగ్ల సినిమాలకు వర్చువల్ ప్రింట్ ఫీజు వసూలు చేయడంలేదని, డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు ప్రాంతీయ చిత్రాలకు వీపీఎఫ్ తగ్గించట్లేదన్నారు. వీపీఎఫ్ ధరలు సున్నాచేయడంలేదని అన్నారు. వాటిని తగ్గించే వరకు థియేటర్ల బంద్ కొనసాగుతుందని స్పష్టంచేశారు. ఇందుకోసం ఐదు రాష్ట్రాల్లోని నిర్మాతలు, పంపిణీదారులు కూడా మద్దతు ఇచ్చారని తెలిపారు.

## నీరవ్ మోదీ మామ ఛోక్సీ ఆస్తులు జప్తు

ఎకరాల ఫామ్‌హౌస్, నాసిక్, నాగ్‌పూర్, పాన్‌వెల్, తమిళనాడులోని విల్లుపురం ప్రాంతాల్లో దాదాపు 231 ఎకరాల భూమిని ఈడీ జప్తు చేసింది. అలాగే తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాలో 170ఎకరాల పార్కును కూడా స్వాధీనం చేసుకుంది. దీని విలువ సుమారు రూ.500 కోట్లు. ముంబయిలోని బొరివాలిలో నాలుగు ఫ్లాట్లు, శాంటాక్రూజ్‌లోని ఖేము టవర్స్‌లో మరో 9 ఫ్లాట్లు స్వాధీనం చేసుకుంది. ఈ ఆస్తులన్నింటి విలువ దాదాపు రూ.1217.2కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

దాదాపు రూ.12వేల కోట్లకు పైగా మోసాలకు పాల్పడిన ఛోక్సీ, నీరవ్‌లు దేశం విడిచి విదేశాలకు పారిపోయిన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి సీబీఐ, ఈడీ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఛోక్సీ, నీరవ్‌లు మాత్రం తాము ఏ తప్పూ చేయలేదని చెప్తున్నారు.

## జయేంద్ర సరస్వతి మహాసమాధి

10గంటలకు జయేంద్ర సరస్వతి బృందావన ప్రవేశం చేశారు. మంటపం ముందున్న గదిలో కూర్చుని నిత్యం భక్తులకు ఆశీస్సులు అందజేసిన ప్రాంతంలోనే జయేంద్ర సరస్వతి మహాసమాధి అయ్యారు. జయేంద్ర సరస్వతి అసలు పేరు సుబ్రహ్మణ్య మహాదేవ అయ్యర్. తమిళనాడులోని తిరువారూర్ జిల్లా మన్నార్‌గుడి సమీపంలోని ఇరుల్‌నిక్కి గ్రామంలో 1935 జులై 18న జన్మించారు. మహాదేవ అయ్యర్, సరస్వతి దంపతుల తొలి సంతానమైన సుబ్రహ్మణ్య మహాదేవ అయ్యర్‌కు కంచి అంటే ఎంతో ఇష్టం. కంచి గడ్డ మీదనే తుది శ్వాస విడవాలని కోరుకున్నారు జయేంద్ర సరస్వతి. ఆ స్వామి అనుకున్నట్లే కంచి గడ్డ మీద కామాక్షి అమ్మవారి సన్నిధి సమీపంలోనే శివైక్యం చెందారు.

## తెలంగాణలో పార్టీ బలోపేతంపై నేతలకు దిశానిర్దేశం

వీడినా వచ్చే నష్టం ఏమీ లేదన్నారు. మే నెలాఖరు నాటికి నియోజకవర్గ కమిటీలను పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. రెండో విడత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు మార్చి 5 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో శుక్రవారం పార్టీ ఎంపీలతో తెదేపా అధినేత, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం కానున్నారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు ఉండవల్లిలోని సీఎం నివాసంలోని గ్రీవెన్స్ హాలులో తెదేపా పార్లమెంటరీ పార్టీ సమావేశం జరగనుంది. పార్లమెంట్ సమావేశాల్లో తెదేపా అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించే అవకాశం ఉంది. ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై తెదేపా కేంద్ర ప్రభుత్వంపై పోరాట బాట పట్టింది. విభజన హామీల సాధనకు కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు పార్లమెంట్ బయట, లోపలా ఆందోళన చేసిన సంగతి తెలిసిందే. అయితే, బడ్జెట్ సమావేశాలు వాయిదా పడినందున ఆ పోరాటానికి తాత్కాలికంగా విరామం వచ్చింది. అయితే, మళ్లీ ఈ నెల 5 నుంచి సమావేశాలు జరగనున్నందున విభజన హామీలతో పాటు రాష్ట్రానికి ప్రకటించిన హామీలన్నింటినీ సాధించేందుకు కేంద్రంపై మరింత ఒత్తిడి పెంచాలని, రాష్ట్ర హక్కుల సాధన, వివిధ పార్టీలు అనుసరిస్తున్న విధానంపై చర్చించే అవకాశం ఉంది. ఇప్పటికే వైకాపా కేంద్రంపై అవిశ్వాసం పెడతామని ప్రకటించడంతో ఆ అంశంపైనా చర్చించే అవకాశం ఉంది. వీటన్నింటి నేపథ్యంలో ఏవిధంగా ముందుకెళ్లాలనే అంశంపై ఈ సమావేశంలో చర్చించనున్నారు.

ఈ సమావేశంలో దేశం నేతలు ఎల్.రమణ, సండ్ర వెంకట వీరయ్య, నామా నాగేశ్వరరావు, రావుల చంద్రశేఖర్ రెడ్డి, పెద్దిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక హోదాపై వెనక్కి తగ్గేది లేదు

ఉన్న రాష్ట్రాలు ఎంతో అభివృద్ధి సాధించాయని తెలిపారు. సీఎం చంద్రబాబుకు ప్రత్యేక హోదాపై చిత్తశుద్ధి లేదంటూ మండిపడ్డారు.

**బాబుకు చిత్తశుద్ధి ఉంటే బయటకు రావాలి**

చంద్రబాబు అసమర్థత వల్లే హోదా రాలేదని వైఎస్ఆర్ సీపీ నేతలు అనంత వెంకట్రామిరెడ్డి, శంకర్ నారాయణ మండిపడ్డారు. అనంతపురంలో చేపట్టిన ధర్నాలో ఈ నేతలు మాట్లాడుతూ.. హోదా, విభజన హామీలు అమలు కాకపోవటానికి చంద్రబాబే కారణం. బాబు చిత్తశుద్ధి ఉంటే ఎన్డీయే నుంచి బయటకు రావాలి. బీజేపీపై నెపం నెట్టి తప్పించుకోవాలని చంద్రబాబు చూస్తున్నారని విమర్శించారు.

**ఏపీ ప్రజల కోసం రాజీనామా బాట..**

రాష్ట్ర ప్రజల మేలు కోసం.. ప్రత్యేక హోదా సాధన కోసం రాజీనామా చేయడానికి నేను గర్వపడుతున్నా. హోదా విషయంలో చంద్రబాబు రాజీపడ్డారు. ఆ అధికారం ఆయనకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. హోదా వచ్చే వరకు వైఎస్ఆర్‌సీపీ పోరాడుతుందని శ్రీకాంత్ రెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. వైఎస్ఆర్ జిల్లా కడప జడ్జీ కార్యాలయం వద్ద వైఎస్ఆర్‌సీపీ చేపట్టిన ధర్నాకు జిల్లాలోని 10 నియోజకవర్గాల కార్యకర్తలు తరలివచ్చి హోదా కోసం తమ గళాన్ని లేవనెత్తారు. ఎంపీ అవినాష్ రెడ్డి, కడప పార్లమెంట్ అధ్యక్షుడు సురేష్ బాబు, ఎమ్మెల్యేలు శ్రీకాంత్ రెడ్డి, అంజాద్ బాషా, రాచమల్లు ప్రసాదరెడ్డి, తదితరులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో వైఎస్ఆర్‌సీపీ కో ఆర్డినేటర్ తోట సుబ్బారావు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

శ్రీకాకుళంలో ధర్మాన ప్రసాదరావు, తమ్మినేని సీతారాం, రెడ్డి శాంతి, ఎమ్మెల్యే కంబాల జోగులు, గొర్లె కిరణ్ కుమార్‌ల ఆధ్వర్యంలో.. ప్రకాశం జిల్లా ఒంగోలు కలెక్టరేట్ వద్ద ఎమ్మెల్యే జంకె వెంకట్ రెడ్డి, బాలినేని నివాసరెడ్డి, పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు ధర్నాలో పాల్గొని ప్రత్యేక హోదా కోసం పోరును ఉధృతం చేశారు.

**చంద్రబాబు రెండు నాల్కల ధోరణి**

ఏపీకి ప్రత్యేక హోదా విషయంలో సీఎం చంద్రబాబు నాయుడు రెండు నాల్కల ధోరణితో వ్యవహరిస్తున్నారంటూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు పార్థసారధి, మల్లాది విష్ణులు మండిపడ్డారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధన కోసం వైఎస్ఆర్‌సీపీ మొదటినుంచీ పోరాడుతోందన్నారు. ప్రత్యేక హోదా అంశాన్ని చంద్రబాబు నీరుగార్చారు. నాలుగేళ్ల నుంచి ప్రత్యేక హోదా సంజీవని కాదు అన్నారు. సదస్సులు నిర్వహించి ఏపీకి హోదా అక్కర్లేదనే విషయాన్ని పరోక్షంగా చెప్పడానికి సీఎం చంద్రబాబు విఫలయత్నాలు చేశారు. ప్రత్యేక హోదా కోసం జననేత వైఎస్ జగన్ ఆధ్వర్యంలో చివరివరకూ పోరాడుతామని వైఎస్ఆర్‌సీపీ నేతలు పార్థసారధి, మల్లాది విష్ణులు అన్నారు.

నెల్లూరులో ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, సంజీవయ్య, రాంరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, పార్టీ నేతలు మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, వంటేరు వేణుగోపాల్ రెడ్డి, నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, తదితరులు కలెక్టరేట్ వద్ద ధర్నాలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు రాజన్నదొర, పుష్పవాణి, పార్టీ నేతలు బొత్స సత్యనారాయణ, పెన్మత్స సాంబశివరాజు, మద్ది నివాసరావు, శత్రుచర్ల పరీక్షిత్ రాజు, బొత్స అప్పలనర్సయ్య, అప్పలనాయుడులు విజయనగరం కలెక్టరేట్ వద్ద ప్రత్యేక హోదా సాధిద్దామంటూ నినాదాలు చేశారు.

## ప్రముఖ రచయిత నాయని కృష్ణమూర్తి కన్నుమూత

జన్మించిన నాయని హైస్కూలు చదువు స్థాయి నుంచే సాహిత్యం, రచనల పట్ల ఆసక్తి చూపారు. 23 ఏళ్ల వయసులో ఆయన రాసిన మొదటి నవల యామినీకుంతలాలుకు ఆంధ్రప్రభ సచిత్రవార పత్రిక నిర్వహించిన 1974 ఆనంద ఉగాది నవలల పోటీలో మూడో బహుమతి లభించింది.

మొదటి నవలకే బహుమతి రావడంతో ఆత్మవిశ్వాసం పెరిగిన నాయని కృష్ణమూర్తి పత్రికా రంగంలోకి అడుగు పెట్టారు. కొంత కాలం బొమ్మరిల్లు, విజయ, నీలిమ పత్రికలకు ఉపసంపాదకుడిగా పనిచేశారు. మిత్రుడుతో కలిసి స్నేహబాల అనే పిల్లల పత్రికను కొంతకాలం నిర్వహించారు. 1977లో మాబడి, 1978లో పాఠశాల పత్రికలను విద్యార్థుల కోసం విజయవాణి సంస్థ ద్వారా ప్రచురించారు. నాయని కృష్ణమూర్తి వెలువరించిన విద్యా సంబంధ మ్యాగజైన్లు విశేషణ ఆదరణ పొందాయి. పలు తెలుగు చిత్రాలకు నేపథ్య గీతాలను రచించారు. ప్రముఖ దర్శకుడు వంశీ రూపొందించిన మహర్షి చిత్రంలో కృష్ణమూర్తి రాసిన 'సుమం ప్రతి సుమం సుమం' పాట విశేష ఆదరణ పొందింది. తెలుగు సాహిత్యానికి చేసిన సేవలకు ఆయన జీవనసాఫల్య పురస్కారాన్ని అందుకున్నారు. ఏకకాలంలో బహుళ రంగాల్లో పనిచేసి తన ప్రతిభను కనబరచిన నాయని మృతి సాహితీ లోకానికి తీరని లోటని రచయితలు, విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు. నాయని స్వగ్రామమైన చిత్తూరు జిల్లా చౌడేపల్లిలో శుక్రవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు ప్రకటించారు

**చంద్రబాబు దిగ్భ్రాంతి**

కృష్ణమూర్తి మృతిపట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దిగ్భ్రంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. కృష్ణమూర్తి బాల సాహిత్య అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు.

## టాటా ట్రస్టు సహకారం మరువలేనిది

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. టీ హబ్ నుంచి రెండేళ్లలో 200 స్టార్టప్‌లు ప్రారంభించాం. టీ హబ్ అతిపెద్ద ఇన్‌క్యుబేటర్ హబ్‌గా నిలుస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో గుండె, కాలేయం మార్పిడి శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం జరిగిన మహిళలకు కేసీఆర్ కిట్ అందిస్తున్నాం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య 31 నుంచి 50శాతానికి పెరిగింది. ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రసవాల సమయంలో శస్త్రచికిత్సలు తగ్గాయి. హెలికాప్టర్ విడిభాగాలు ఇక్కడ తయారుకావడం గొప్ప విషయం. జంషెడ్‌పూర్ తర్వాత టాటా ప్రధాన కార్యాలయాలు ఇక్కడ ఉన్నాయి అని పేర్కొన్నారు.

# మహా ప్రదర్శనలో రవాణా కార్మికులు పాల్గొనాలి

## సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్.నరసింగరావు




విశాఖపట్నంః కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోయే మోటార్ వెహికల్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, పెట్రోలియం ఉత్పత్తులను జిఎస్‌టి పరిధిలోకి తీసుకురావాలని, రవాణారంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, ఇతర ప్రధాన డిమాండ్స్‌పై మార్చి 6న దేశవ్యాపితంగా ఆందోళన చేయాలని జాతీయ కన్వెన్షన్ పిలుపునిచ్చింది. ఈ ఆందోళనలో మోటారు కార్మికులను, ప్రజలను భాగస్వాములు చేసేందుకు వివిధ స్థాయిల్లో కరపత్రాలు, సదస్సులు, జాతాలు తదితర రూపాల్లో విస్తృత ప్రచార క్యాంపెయిన్ నిర్వహించాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్.నరసింగరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు పబ్లిక్ లైబ్రరీలో జరిగిన సదస్సు ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. మంగళవారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఈ చట్ట సవరణ ఆమోదింపబడితే తమ ఉపాధి పూర్తిగా కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బిల్లులో శిక్షలు మాత్రమే ఉన్నాయి కానీ రక్షణ కోసంఏ ఒక్కటీ లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరి మీద ఒకరు నెపాన్ని నెట్టివేస్తూ కార్మికులను మోసం చేస్తున్నాయి. బిజెపి, టిడిపికి బుద్ధిచెప్పే విధంగా కార్మికులు ఆందోళనలో పాల్గొనాలని కోరుతున్నాం. విశాఖ నగరంలో మార్చి 2 నుండి ఏరియాల వారీగా నిరసనలు ర్యాలీలు, నగర వ్యాప్తంగా జాతా, 6వ తేదీన సరస్వతీపార్కు నుండి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు భారీ ర్యాలీ అనంతరం సభ వంటి కార్యక్రమాలు జయప్రదం చేయాలని సదస్సు తీర్మానం చేసింది.

ఈ సదస్సులో ప్రధానవక్తగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్.నరసింగరావు, సిఐటియు నగర ప్రధానకార్యదర్శి ఎం.జగ్గునాయుడు, లారీ వెల్ఫేర్ అసొసియేషన్ కోశాధికారి సూరిబాబు, పెట్రోల్ బంక్ అసొసియేషన్ జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, మోటార్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు, అన్‌లైన్ క్యాబ్స్ మురళి, పాత్రుడు, మాధవ్‌లు ప్రసంగించారు.

ఈ తీర్మానాన్ని పోర్టు ట్రాన్స్‌పోర్టు యూనియన్ అధ్యక్షుడు బి.జగన్ ప్రవేశపెట్టారు. ఈ సదస్సుకు ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.అప్పలరాజు అధ్యక్షత వహించారు.

# శాంతిపురంలోగల పౌర రక్షణ సంస్థలో 214వ బ్యాచ్ ముగింపు కార్యక్రమం



విశాఖపట్నం : పౌర రక్షణ మౌలిక ముగింపు కార్యక్రమం నిర్వహించారు. సదరు కార్యక్రమానికి వి. ఉమా మహేశ్వర్ రావు, రిజిస్ట్రార్, ఆంధ్ర విశ్వవిద్యాలయ, విశాఖపట్నం వారు ముఖ్య అతిధులుగా విచ్చేశారు. పౌర రక్షణ సంస్థ శిక్షణలో అర్హత పొందిన 74 మంది వాలంటీర్లు ప్రదర్శించిన సాహసోపేతమైన విన్యాసాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నవి. గురువారం 214వ బ్యాచ్ ముగింపు కార్యక్రమం సందర్భంగా వాలంటీర్లు ప్రదర్శించిన విన్యాసాలు అబ్బురపరచినవి. అగ్ని ప్రమాదములో మంటలు ఆర్పడం, ఎత్తైన భవనాల నుండి ప్రజలను రక్షించడము, ప్రాథమిక చికిత్స చేయడం, వార్డెన్ సర్వీసులను చక్కగా ప్రదర్శించారు. ముఖ్యంగా అగ్నికీలలను అదుపు చేయడం, ఆర్పివేయడం, బహుళ అంతస్తుల నుండి పౌరులను రక్షించడం, శిథిలాలలో చిక్కుకున్న వారిని వెలికితీయడం తదితర సాహస విన్యాసాలను ప్రదర్శించినారు. అలాగే పోలీస్ వైర్ లెస్ సెట్లను ఉపయోగించి కమ్యూనికేషన్ చేయడం కూడా ప్రదర్శించారు. గురువారం 214వ బ్యాచ్ పౌర రక్షణ మౌలిక ముగింపు కార్యక్రమం ఘనంగా జరుపుకున్నారు. 214వ బ్యాచ్ పౌర రక్షణ మౌలిక ముగింపు కార్యక్రమం సందర్భంగా వి. ఉమా మహేశ్వర్ రావు, రిజిస్ట్రార్, ఆంధ్ర విశ్వవిద్యాలయ, విశాఖపట్నం వారు పౌర రక్షణ వాలంటీర్లు నుండి గౌరవ వందనం స్వీకరించినారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధులుగా విచ్చేసిన వి. ఉమా మహేశ్వర్ రావు, రిజిస్ట్రార్, ఆంధ్ర విశ్వవిద్యాలయ, విశాఖపట్నం వారు మాట్లాడుతూ పౌర రక్షణ సంస్థలో శిక్షణ పొందినవారు ప్రకృతి వైపరీత్యాల సమయంలో స్వచ్ఛందంగా వచ్చి ప్రభుత్వ కార్యకలాపాలలో తప్పనిసరిగా పాల్గొనాలని వాలంటీర్లకు సూచించినారు. ఈ సందర్భంగా జి.జవహార్ లాల్ నెహ్రూ, ఇంతవరకు శిక్షణ పొందిన వాలంటీర్లు అందరు అత్యవసర పరిస్థితులలో పిలుపు అందిన వెంటనే సేవ కార్యక్రమములు చేయుటకు ముందుకు రావలసిందిగా కోరియున్నారు. ఈ శిక్షణ తరగతులను నిర్విరామంగా నిర్వహిస్తున్న ఉప పౌర రక్షణ అధికారి మరియు స్పెషల్ డిప్యూటి కలెక్టర్ జి. జవహార్ లాల్ నెహ్రూ తోడ్పడుతున్న ఇతర శాఖల అధికారులు, సిబ్బంది కృషి అభినందనీయమని ముఖ్య అతిధిగా విచ్చేసిన ఉమా మహేశ్వర్ రావు, రిజిస్ట్రార్, ఆంధ్ర విశ్వవిద్యాలయ, విశాఖపట్నం పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాన్ని గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్, సహకారంతో సివిల్ డిఫెన్సు ఆర్గనైజేషన్ ద్వారా నిర్యహిస్తుంది.

ఈ కార్యక్రమములో జి.జవహార్ లాల్ నెహ్రూ, ఉప పౌర రక్షణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలక్టర్, రిటైర్డ్ డి.ఎం. అండ్ హెచ్.ఓ. డాక్టర్ పి. రామారావు, ఎస్. బాల ప్రసాద్, శ్రీనివాస రాజామణి, వైద్య సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది, పోలీస్ శాఖ వారు మరియు సివిల్ డిఫెన్సు సిబ్బంది పాల్గొన్నారు.





# నేడే అప్పన్న డోలోత్సవం



సింహాచలం : సింహగిరి పై కొలువైయున్న శ్రీ వరహాలక్ష్మీనారసింహ స్వామి వారి ప్రధానమైనగి డోలోత్సవం. దీన్నే వాడుకలో కొందరు బొట్టిని అడిగే పున్నమి అని అంటారు. ఎందుకు అలా అంటారు అంటే స్వామి వారు కొండ దిగువనగల స్వామి సోదరి అయినటువంటి పైడితల్లి అమ్మవారి కూతురుని కళ్యాణమాడటానికి అడగటానికి వస్తారు ఈ కార్యక్రమం ఫాల్గుణ శుద్ధ పౌర్ణమినాడు నిర్వహిస్తారు . ఈ రోజున స్వామి వారు ఉ 6:15 కి బయలు దేరి మెట్లమార్గంగుండా కొండద్రిగువన పుష్కరిణిలోగల మండపమునకు చేరుకోగా వైదికులు డోలోత్సవం ,వసంతోత్సవం ,చూర్ణోత్సవం ఉత్సవముల అత్యంత వైభవముగా జరుపుతారు. అనంతరం స్వామివారి తిరువీధి ఉత్సవం జరుగును కనుక యావన్మంది భక్తకోటి ఈ ఉత్సవములలో పాల్గొని తీర్థప్రసాదములు స్వీకరించి స్వామి కృపని పొందవలెను .ఈ సందర్భంగా కొండపైన జరుగు నిత్యకల్యాణం జరగదు అని దేవస్థానం అధికారులు తెలిపారు.

## ఆస్తిపన్ను, నీటి పన్ను చెల్లించండి

# నగరాభివృద్ధికి సహకరించండి

## రెండవ జోనల్ కమిషనర్ పి.నల్లనయ్య

విశాఖపట్నం: జి.వి.ఎం.సి.పరిధిలోని రెండవ జోన్ 7వ వార్డు నుండి 18 వార్డులలో ఆస్తిపన్ను, నీటి పన్ను 7వ వార్డు నుండి 18 వార్డులలో ఆస్తి పన్ను, నీటి పన్ను చెల్లించని మొండి బకాయిదారుల ఆస్తులు సీజ్ చేయుట మరియు నీటి సరఫరా నిలిపివేసినట్లు జోనల్ కమిషనర్ పి.నల్లనయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 28 బుధవారం 32 నివాసితుల నుండి నీటి సరఫరా నిలిపివేయడమైనది. 10వ వార్డులో ఒక ప్రముఖ కళ్యాణ మండపం, టింబర్ డిపో సీజ్ చేయుటకు వెళ్లగా రూ.2.52 లక్షలు చెల్లించారు.

కావున నగర అభివృద్ధికి ఆస్తిపన్ను, నీటి పన్ను సకాలంలో చెల్లించి సహకరించవలసిందిగా ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# జి.వి.ఎం.సి. సైన్స్‌ల్యాబ్‌ల నిర్వహణకు హెచ్.పి.సి.ఎల్ ఒప్పందం

- రూ.38 లక్షలతో 15 సెట్ల సైన్స్ ల్యాబ్ మెటీరియల్
- హెచ్.పి.సి.ఎల్ వితరణ పట్ల కమిషనర్ అభినందన
- మరిన్ని ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహించాలని విజ్ఞప్తి
- హెచ్.పి.సి.ఎల్. స్ఫూర్తిగా దాతలు ముందుకు రావాలి
- జి.వి.ఎం.సి. కమిషనర్ హరినారాయణన్

విశాఖపట్నం : జి.వి.ఎం.సి. ఉన్నత పాఠశాలల సైన్స్ ల్యాబొరేటరీల నిర్వహణకు రూ. 38 కోట్లతో హెచ్.పి.సి.ఎల్. గురువారం ఒప్పందంపై సంతకాలు చేసినట్లు కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. మున్సిపల్ పాఠశాలను డిజిటల్ పాఠశాలలుగా రూపొందిస్తున్న తరుణంలో హెచ్.పి.సి.ఎల్ సైన్స్ ల్యాబొరేటరీల నిర్వహణకు నిధులు విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. హెచ్.పి.సి.ఎల్ స్ఫూర్తిగా మరింతమంది ముందుకు రావాలని, మరిన్ని ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. హెచ్.పి.సి.ఎల్. హ్యూమన్ రిసోర్స్ ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ ఎన్.రాజారావు, పబ్లిక్ రిలేషన్స్ చీఫ్ మేనేజర్ యు.ఎస్.శర్మ, పి.ఆర్. మేనేజర్, ఎం.కె.వి. నరసింహా, ఏడిసిలు ఎస్.ఎస్.వర్మ, జి.వి.వి.ఎస్. మూర్తి, బాల్యం పిఓ ఎస్.టి.వి. రత్నకుమార్, సి.ఎం.ఓ.హెచ్. డా॥ ఎ.హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

# రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

_ హనుమంతువాక వంతెన వెడల్పు పనులు పూర్తి చేయండి - విశాలాక్షినగర్ రోడ్డు, కైలాసగిరి కూడలి రహదారుల అభివృద్ధి

జి.వి.ఎం.సి. కమిషనర్ హరినారాయణన్




విశాఖపట్నం: విశాలాక్షినగర్ రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జి.వి.ఎం.సి. కమిషనర్ హరినారాయణన్ ఆదేశించారు. క్షేత్ర పర్యటనలో భాగంగా గురువారం విశాలాక్షినగర్, కైలాసగిరి రహదారులను పరిశీలించారు. అనంతరం హనుమంతువాక వంతెన విస్తరణ పనులను పరిశీలించి వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. తొలుత రవీంద్ర నగర్‌లో నిర్మించిన డిపార్టుమెంట్లను ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ నిమిత్తం పరిశీలించారు. ప్లాన్ ప్రకారం లేనందున అసంతృప్తి వ్యక్తం చేశారు.

పర్యటనలో ఎస్.ఇ. వేణుగోపాల్, ఇ.ఇ. చక్రవర్తి, డి.ఇ. దిలీప్, ఎసిపి వెంకటేశ్వరరావు, ఎ.ఇ. శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ, పునరుత్పాదక రంగాలలో

# విస్తృత అవకాశాలు

## ఐఎండి డిజి డాక్టర్ కె.జె రమేష్



విశాఖపట్నం : వ్యవసాయ ఆధారిత, పునరుత్పాదక ఇంధన వనరుల రంగంలో విస్తృత అవకాశాలు లభిస్తాయని ఇండియన్ మెట్రలాజికల్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ జెనరల్ డాక్టర్ కె.జె రమేష్ అన్నారు. గురువారం ఉదయం ఏయూ టిఎల్‌ఎన్ సభామందిరంలో ఇండియన్ మెట్రాలిజికల్ సొసైటీ విశాఖ శాఖ నిర్వహించిన ఆచార్య రొక్కం రామనాథం స్మారకోపన్యాసంలో ఆయన ' వెదర్, క్లైమేట్ అండ్ హజార్డ్ వార్నింగ్ సర్వీసెస్ ఇన్ ఇండియా-డెవలప్‌మెంట్స్, ఆపర్చునుటీస్ అండ్ చాలెంజెస్' అంశంపై ప్రసంగించారు. అనంతరం మాట్లాడుతూ విద్యుశ్చక్తిని పవన, సౌర శక్తి నుంచి ఉత్పత్తి చేయడం పెరిగిందన్నారు. రోజుకు నాలుగు గిగావాట్ నుంచి 60 గిగావాట్ శక్తిని ఉత్పత్తి చేసే స్థాయికి పెంపొందించడం జరిగిందన్నారు. అదే విధంగా విద్యుత్ పంపిణీ రంగంలో సైతం నిపుణులు అవరమన్నారు. ఎండలు తీవ్రతను ముందుగా గణించి చెప్పడం తద్వారా విద్యుత్ సరఫరా వ్యవస్థను క్రమబద్ధీకరించడం సాధ్యపడుతుందన్నారు. పర్యావరణ మార్పుల ఫలితంగా అవసరాలు మారిపోతున్నాయన్నారు.దేశంలో 24 పాపులర్ వెదర్ రాడార్స్ పనిచేస్తున్నాయన్నారు, వీటికి అదనంగా మరో 22 సమకూరనున్నాయన్నారు. ప్రతీ అరగంటకు ఉష్ణోగ్రతల్లో మార్పు, మేఘాల గమనం డిజిటల్ డేటాతో గుర్తించడం సాధ్యపడుతుందన్నారు. క్లౌడ్ కంప్యూటింగ్ ఆధారిత సేవలు మరికొద్ది నెలల్లో పొందడం సాధ్యపడుతుందనాశ్రీను. జూలై నాటికి ప్రత్యేక యాప్‌ను తయారు చేస్తామన్నారు. సమాచారాన్ని సంగ్రహించడం, విశ్లేషించడం, అంచనా వేయడం, పర్యవేక్షణ చేయడం జరుగుతుందన్నారు.

భారీ వర్షపాతాలను ముందుగా గుర్తించడం జరుగుతోందన్నారు. ఉష్ణగాలులు గుర్తించి హెచ్చరించే విధానం వలన మరణాల సంఖ్య భారీగా తగ్గించగలిగామన్నారు.

విమానాశ్రయా లలో ఉపయోగించే ఉపకరణాలు ఐఎండి సహకారంతో దేశీయంగా తయారు చేసి వినియోగంచడం జరుగుతోందన్నారు.

వర్సిటీ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో విశిష్ట శాస్త్రవేత్తలను అందించిందని, దీనిలో రంగనాథం ఒకరన్నారు.

విభాగ ఆచార్యులు ఎస్.ఎస్.వి.ఎస్ రామక్రిష్ణ ఆచార్య రొక్కం రామనాథం విశేషాలను వివరించారు.

కార్యక్రమంలో విభాగ విశ్రాంత ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ కె.జె రమేష్‌ను వర్సిటీ తరపున జ్ఞాపిక బహూకరించి సత్కరించారు.

# కేంద్ర పథకాల అమలులో విజయనగరం ముందంజ : దిశ సమీక్షలో వెల్లడి



విజయనగరం : కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, సమాజ వికాసంకోసం ప్రవేశపెట్టిన పలు పథకాల అమలులో విజయనగరం జిల్లా ముందంజలో నిలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం ద్వారా దాదాపుగా 54 పథకాలు వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలు చేస్తుండగా, ఇందులో మన జిల్లాలో 34 వరకు పథకాలు వివిధ శాఖల ఆధ్వర్యంలో అమలు జరుగుతున్నాయి. వీటిలోనూ పెద్దమొత్తంలో ప్రతి ఏటా నిధులు విడుదలవుతున్న ముఖ్యమైన పథకాలు 14 వరకూ ఉన్నాయి. వ్యవసాయం, విద్య, వైద్యం, పారిశుద్ధ్యం, తాగునీరు, దివ్యాంగుల సంక్షేమం, ఉపాధి, విద్యుత్ సరఫరా, మహిళా శిశు సంక్షేమం, జలవనరులు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గృహనిర్మాణం, భూరికార్డుల డిజిటలైజేషన్, పట్టణాభివృద్ధి తదితర ఎన్నో శాఖల ద్వారా కేంద్ర పథకాలు అమలవుతున్నాయి. ఈ పథకాల అమలు తీరును ఎప్పటికప్పుడు తెలుసుకొని పర్యవేక్షించేందుకే దిశ పేరుతో ఆయా పథకాల అమలుపై సమీక్షలకు ఏర్పాట్లు చేయడం జరిగింది. పార్లమెంటు సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పడే కమిటీ యీ పథకాల అమలు తీరును తెలుసుకొని వీటి అమలుపై అధికారులకు అవసరం మేరకు తగిన సలహాలు, సూచనలు చేస్తుంది. కేంద్ర మంత్రి పి.అశోక్ గజపతిరాజు అధ్యక్షతన గురువారం జరిగిన అధికారుల సమీక్షలో ఆయా పథకాల అమలులో మన జిల్లా రాష్ట్రంలో ఏ స్థానంలో వుందన్న విషయాన్ని కేంద్ర మంత్రి ఆరా తీశారు.

ఈ సందర్భంగా పలు పథకాల అమలులో మన జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచి ముందంజలో ఉన్నట్టు వెల్లడైంది. కేంద్ర పథకాల్లో అత్యంత ప్రధానమైనది మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం. ప్రతి ఏటా కొన్ని లక్షల మంది గ్రామీణులకు ఉపాధి కల్పిస్తూ, గ్రామీణ ప్రాంతాలకు ఒక వరంలా భావిస్తున్న యీ పథకం అమలులో విజయనగరం అగ్రస్థానంలో నిలుస్తూనే వుంది. ఈ పథకం అమలులో రాష్ట్ర సగటు 67శాతం వుండగా మన జిల్లా 99శాతం ప్రగతి సాధించి ముందువరసలో నిలిచింది. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ఓ.డి.ఎఫ్.గా రూపొందని జిల్లాల్లో విజయనగరం 89శాతం లక్ష్యసాధనతో రెండో స్థానంలో నిలిచింది. జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమం అమలులో భాగంగా మాతాశిశు మరణాల నియంత్రణలో మంచి ఫలితాలు సాధిస్తూ మాతృ మరణాల నియంత్రణలో రాష్ట్రంలో మొదటి స్థానంలోనూ, శిశు మరణాల నియంత్రణలో 5వ స్థానంలో నిలిచింది. గ్రామీణ ప్రాంతాల్లో పక్కా రోడ్లు నిర్మించేందుకు ఉద్దేశించిన ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన (పి.ఎం.జి.ఎస్.వై.)లోనూ వందశాతం లక్ష్యాల సాధన ద్వారా జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. ప్రదానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజనకు సంబంధించి లబ్దిదారుల నమోదులో రాష్ట్రంలోనే మన జిల్లా మొదటిస్థానంలో వుంది. రైతాంగానికి ఉద్దేశించిన ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన అమలులోనూ జిల్లా రెండో స్థానంలో వుంది. ఇక ఐ.సి.డి.ఎస్., దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ్ కౌశల్ యోజన, ప్రధానమంత్రి గ్రామీణ ఆవాస్ యోజన కార్యక్రమాల్లో రాష్ట్రంలో 7వ స్థానంలో నిలిచింది. వీటితోపాటు నేషనల్ సోషల్ ఎసిస్టెన్స్ ప్రోగ్రాం అమలులో ఐదో స్థానం, ప్రధానమంత్రి కృషి సంచాయి యోజన అమలులో 6వ స్థానంలో వుంది. ఉద్యానశాఖలో అమలు చేస్తున్న రాష్ట్రీయ కృషివికాస్ యోజన, ఎన్.ఎం.ఓ.ఓ.పి. కార్యక్రమంలో 9వ స్థానంలో నిలిచింది. మరోవైపు ఏ.పి.ఎం.ఐ.పి. ద్వారా అమలు చేస్తున్న పి.ఎం.కె.ఎస్.వై. పథకం అమలు చివరిస్థానంలో నిలిచింది. దీనికి గల కారణాలపై కేంద్ర మంత్రి ఆరా తీశారు. కమతాలు దూరంగా వుండటం తదితర కారణాలతో లక్ష్యాన్ని సాధించలేకపోయినట్లు పి.డి. వివరించారు. రానున్న రోజుల్లో లక్ష్యం మేరకు పథకాన్ని అమలు చేసేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని మంత్రి సూచించారు. పాఠశాల క్రీడా మైదానాలను పూర్తిచేయడంలో సమస్యలు వున్నాయని పి.డి. రాజగోపాల్ తెలుపగా, ఆయా గ్రామాల సర్పంచ్‌లతో సమావేశం నిర్వహించి వాటి నిర్మాణంలో గల సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు.

# విజయభాను సంపాదకీయం

## భద్రత పాటించాలి

బాలల భద్రతపై దృష్టి సారించాల్సిన అవసరాన్ని కూడా ధరంపూర్ దుర్ఘటన సూచిస్తున్నది. మన దేశంలో ప్రతి రోజు 43 మంది పిల్లలు రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్నారనేది దిగ్భ్రాంతికరమైన విషయం. పిల్లల భద్రతకు సంబంధించి ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనలను మన దేశంలో పాటించడమే లేదు. పిల్లలను బడికి, ఇంటికి సురక్షితంగా తరలించే విషయమై కఠిన నిబంధనలను రూపొందించి కచ్చితంగా అమలు చేయాలె. పాఠశాల బస్సులు, డ్రైవర్లకు సంబంధించి మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలె. ఎక్కడ ప్రమాదాలకు అవకాశం ఉన్నదో గుర్తించి చర్యలు తీసుకోవాలె. తల్లిదండ్రులకు కూడా భద్రతా సూత్రాలను బోధించి చైతన్యపరుచాలె. బీహార్‌లోని ముజఫర్‌పూర్ జిల్లా మీనాపూర్‌లో కారు ఢీకొని తొమ్మిదిమంది బడిపిల్లలు మరణించడం అత్యంత దారుణం. ఈ దుర్ఘటనలో మరో పన్నెండు మంది పిల్లలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ మొత్తం ఉదంతం రాజకీయవ్యవస్థ ఎంత మొద్దుబారిపోయి ఉన్నదో వెల్లడిస్తున్నది. ప్రమాదం జరిగిన వెంటనే గాయపడిన వారిని దవాఖానకు తరలించడం వాహనం నడిపేవారి బాధ్యత. కానీ వాహనాన్ని నడుపుతున్న బీజేపీ నేత మనోజ్ బైతా ప్రమాదం సృష్టించిన బీభత్సాన్ని పట్టించుకోకుండా వెళ్ళిపోయాడు. బడిపిల్లలు ఉండేచోట వాహనాన్ని జాగ్రత్తగా నడుపాలనే కనీస అవగాహన ఉన్నా ఈ ప్రమాదం జరుగకపోయేది. ఈ ఉదంతంలో బీహార్ ప్రభు త్వం, బీజేపీ నాయకత్వం వ్యవహరించిన తీరు కూడా బాధ్యతారహితంగా ఉన్నది. తమ పార్టీ నాయకుడే ప్రమాదకారకుడని మొదటే అంగీకరించి చర్య తీసుకుంటే హుందాగా ఉండేది. కానీ మొదట్లో ప్రమాదకారకులు ఎవరో తెలువలేదు. వాహనంపై ఉన్న బీజేపీ గుర్తు మూలంగా ఆ పార్టీ నాయకుడనేది మొదట వెల్లడైంది. ఆ తరువాత ఆ వాహనం యజమాని మనోజ్ బైతా అనేది వెల్లడైంది. అయినా అతడిని పోలీసులు అరెస్టు చేయలేదు. బీజేపీ నాయకులు బైతా తమ పార్టీకి సంబంధించిన వ్యక్తి కాదని బుకాయించారు. బైతా వాహనంలో ఉన్నాడా లేడా అనే సందిగ్ధం నెలకొన్నది. కానీ సీసీటీవీ దృశ్యాల ఆధారంగా బైతా స్వయంగా వాహనం నడుపుతున్నాడని వెల్లడైంది. ప్రజాభిప్రాయం వ్యతిరేకంగా మారుతుండటంతో బీజేపీ నాయకులు బైతా ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించక తప్పలేదు. బైతా స్వయంగా వచ్చి లొంగిపోయే వరకు పోలీసులు అతడిని అరెస్టు చేయనే లేదు. బైతా వాహనం నడుపుతున్నప్పుడు మద్యం సేవించి ఉన్నాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బీహార్‌లో మద్య నిషేధం అమలులో ఉన్నందున ఈ ఆరోపణలకు మరింత ప్రాధా న్యం ఏర్పడ్డది. బీహార్‌లో జేడీయూ- బీజేపీ కూటమి అధికారంలో ఉన్నందున బైతాను పోలీసులు వెంటనే అరెస్టు చేయలేదనే ఆరోపణలకు బలం చేకూరుతున్నది. ధరంపూర్‌లో జరిగిన ప్రమాదానికి అధికార యంత్రాంగం కూడా బాధ్యత వహించక తప్పదు. ఈ సర్కారు బడి 77వ నెంబరు జాతీయ రహదారికి యాభై మీటర్ల దూరంలోనే ఉన్నది. పిల్లలు ప్రతిరోజు బడికి వెళ్ళిరావాలంటే, ఈ రహదారి దాటాల్సిందే. దగ్గర్లోనే అతివేగంగా వాహనాలు తిరుగాడుతుంటాయి. బడిని అక్కడి నుంచి వేరే చోటికి మార్చాలని పేద తల్లిదండ్రులు ఎంతో కాలంగా ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. కానీ అధికార యంత్రాంగం పట్టించుకో లేదు. ఏదో ఒక రోజున ఘోర ప్రమాదం జరుగవచ్చునని తల్లిదండ్రులు భయపడుతూనే ఉన్నారు. ఇప్పుడు ఆ ఘోరం జరిగిపోయింది. అందుకే ప్రమాదం జరిగిన వెంటనే ప్రజలు ఆగ్రహంతో జాతీయ రహదారిపై రాకపోకలను అడ్డుకున్నారు. ప్రమాదంలో పిల్లలు మరణించిన వెంటనే ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి నాలుగేసి లక్షల రూపాయల పరిహారాన్ని ప్రకటించింది. ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశించింది. కానీ ప్రభుత్వ యంత్రాంగం ముందే తల్లిదండ్రుల విజ్ఞప్తిని ఆమోదించి, బడిని వేరేచోటికి తరలించినట్టయితే పిల్లల ప్రాణాలు పోకపోయేవి. ఎంతో ఒత్తిడి వస్తే తప్ప స్పందించలేనంతగా ప్రభుత్వ యంత్రాంగం మొద్దుబారిపోయి ఉన్నది. ఇటీవలనే ఒక రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట అనేకమంది ప్రాణాలను హరించింది. పాతకాలపు ఈ ఒక్క వంతెన సరిపోవడం లేదని మరిన్ని నిర్మించాలని ఎంతో కాలంగా ప్రయాణికులు కోరుతున్నా పట్టించుకొనేవారు లేరు. ఒక దుర్ఘటన జరిగిన కొందరు బలైతే కానీ అధికార యంత్రాంగంలో చలనం రావడంలేదు. ఇది పాలనా సంస్కృతికి సంబంధించిన అంశం. ప్రభుత్వ యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా, చురుకుగా ఉంటే అనేక సమస్యలు అతి సులభంగా పరిష్కారమైపోతాయి. బాలల భద్రతపై దృష్టి సారించాల్సిన అవసరాన్ని కూడా ధరంపూర్ దుర్ఘటన సూచిస్తున్నది. మన దేశంలో ప్రతి రోజు 43 మంది పిల్లలు రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్నారనేది దిగ్భ్రాంతికరమైన విషయం. పిల్లల భద్రతకు సంబంధించి ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనలను మన దేశంలో పాటించడమే లేదు.

# ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



భీమునిపట్నం : తగరపువలస లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలనీ ప్రజా సంఘాలు, వామపక్షాలు తెలిపారు. స్థానిక వెల్ఫేర్ సెంటర్ లో అఖిలపక్షాలు, ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాయి. ఈ సందర్భంగా సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు అల్లు బాబూరావు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చారనీ ఆ హామీలు హామీలుగా మిగిలిపోయాయనీ అన్నారు. సిపిఎం నగర ఉపాధ్యక్షుడు ఆర్.ఎస్.ఎన్. మూర్తి మాట్లాడుతూ చిన్న రాష్ట్రాల సిద్ధాంతం తో బిజెపి కాంగ్రెస్రా తో జట్టు కట్టి రాష్ట్రంను విభజన చేసిందనీ తెలిపారు. ఆంధ్రాచైతన్య పార్టీ అధ్యక్షుడు కంటుభుక్త రామనాయుడు మాట్లాడుతూ రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేయడానికి ఉత్తరాలు ఇచ్చిన చంద్రబాబు విభజన తరువాత సమైక్య ఉద్యమంటూ కాకి గోల చేస్తున్నారనీ అదేవిధంగా బిజెపి రాష్ట్రం ను ఉద్ధరించినట్లు నటిస్తుందనీ తెలిపారు. ప్రజలు ఇదంతా గమనిస్తున్నారనీ తెలిపారు. ఇప్పటికే చాలా ఆలస్యం అయిపోయిందనీ ఇంకా బిజెపి, టీడీపీ లను నమ్ము కోవడం వలన ప్రయోజనం లేదని చెప్పారు. పార్లమెంట్ సమావేశాలు లో మనకు రావలసిన వన్నీ రాబట్టే విధంగా ప్రజలు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్కరమాని రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

### కల్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో

# ఘనంగా స్వామివారికి చక్రతీర్థోత్సవం



భీమునిపట్నం : స్థానిక కృష్ణా కోలని లో కల్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయం లో షష్టమ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం ఐదు గంటల నుండి సుప్రభాత సేవ,ప్రభాత ఆరా ధన ఎనిమిది గంటలకు కొట్నాల ఉత్సవం పది గంటలకు చక్రతీర్థోత్సవం సాగరసంగం లో నిర్వహించారు, మధ్యాహ్నం పన్నెండు గంటల నుండి అన్న కూటోత్సవం, నారాయణ సేవలు ఆలయ ప్రధాన అర్చకులు జి.వి.అప్పలాచార్యులు గణంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్న సమరాధన కార్యక్రమం జరిగింది. ఈ కార్య క్రమానికి, తీర్ధ ప్రసాదాలు అంద జేశారు.

సాయంత్రం ఐదు గంటలకు ద్వాదశ ఆరాధనలు, నిత్య హోమాలు నిర్వహించారు. ఈ కార్య క్రమం లో భీమిలి ఇన్ ఛార్జ్ చిక్కాల విజయ బాబు మార్కెట్ కమీటి చైర్మన్ కోరాడ. నాగభూషణ రావు, ఎం.పి.పి. యరబాల.క్రిష్ణవేణి,అనిల్ ప్రసాద్, భీమిలి డివిజన్ అద్యక్షులు గంటా నూకరాజు జిల్లా రూరల్ తెలుగు మహిళా అద్యక్షురాలు కురుమిన లీలావతి, కల్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయం అద్యక్షులు గాడు అప్పల నాయుడు, కార్యదర్శి రేలంగి వెంకట అప్పలనర్సయ, కోశాధికారి ఆదిమూలం నాగరాజు, సభ్యులు కె.ముత్యాల రావు ,జి.సన్యాసిరావు,సన్నిబాబు, పంచదార్ల రవి తదితరులు పాల్గొన్నారు.

# కుష్టువ్యాధిగ్రస్తులు ఆర్థికంగా ఎదగాలి



విజయనగరం : కుష్టువ్యాధిగ్రస్తులు స్వయం శక్తితో ఆర్థికంగా ఎదగాలని క్రియేట్ ప్రాజెక్టు జిల్లా కోఆర్డినేటర్ టి.దీప్తి విజ్ఞప్తి చేశారు. గురువారం పూల్‌బాగ్ కుష్టువ్యాదిగ్రస్థుల కాలనీలో కుష్టు వ్యాదిగ్రస్థులకు సామాజిక అంశాల ప ట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ప్రాజెక్టు కోఆర్డినేటర్ దీప్తి మాట్లాడుతూ ప్రభుత్వం వికలాంగ సంక్షేమ శాఖ, కుష్టు వ్యాధి నిర్మూళనా సంస్థ ద్వారా కుష్టు వ్యాదిగ్రస్తుల కోసం వివిధ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. కుట్టు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసు కోవడం ద్వారా టైలరింగ్ యూనిట్లను నెలకొల్పాలని, అందుకు క్రియేట్ ప్రాజెక్టు పూర్తి సహాయ, సహ కారాలను అందిస్తుందన్నారు. ప్రభుత్వం వికలాంగులకు మంజూరు చేసే పించను సదుపాయం, రుణాలు పొందాలని సూచించారు. కుష్టు వ్యాదిగ్రస్తులు ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని, యాచన వృత్తిని మానివేసి వలస జీవనాన్ని వదిలి స్థానికంగా నివశించడం ద్వారా వీరు ప్రభుత్వ పథకాలను పొందవచ్చునన్నారు. సమాజంలో కుష్టువ్యాదిగ్రస్తుల పట్ల చులకన భావం పోవాలన్నారు. ఆధార్‌కార్డు ప్రభుత్వ పథకాలను పొందేందుకు ప్రాథమిక అర్హతగా ప్రతీ ఒక్కరూ గుర్తించాలని సూచించారు. సిగ్మాకిట్‌లను శతశాతం సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చెల్లూరు లెప్రసీ మిషన్ వృత్తి విద్యా శిక్షణా సంస్థ ద్వారా కుష్టు వ్యాధిగ్రస్తుల పిల్లలకు వివిధ ట్రేడులలో శిక్షణ ఇచ్చి తద్వారా వారిని పారిశ్రామిక రంగంలో ఉపాధి అవకాశా లను కల్పించడం జరిగిందన్నారు. ఈ సదస్సులో దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు చేసుదాస్, ప్రసాద్, అప్పలనాయుడులతో పాటు దివ్యాంగులు, కుష్టు వ్యాధిగ్రస్తులు పాల్గొన్నారు.

# మందుబాబులకు అడ్డాగా ఆసుపత్రి

కొయ్యూరు : మండలంలో కంఠారం ఆసుపత్రి ప్రాంగణం మందుబాబులకు అడ్డాగా మారింది. స్థానికులు ఆ ప్రాంతాన్ని బహిర్భూమిగా కూడా వినియోగించడం గమ నార్హం. ఇటీవల దీనిని 24 గంటల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. దీంతో రాత్రి పూట సిబ్బందితో ఆసు పత్రిలో ఉంటున్నారు. ఆకతాయిలు కొందరు రాత్రి సమయంలో ఆసుపత్రి భవనానికి సమీపంలో మద్యం సేవించి సీసాలను విడిచిపెడుతున్నారు.ఆసుపత్రికి ప్రహరీ మంజూరు చేయాలని కిందటి నెలలో జరిగిన జన్మభూమి సభకు వచ్చిన ఐటిడిఏ పిఒ రవిపట్టా న్‌శెట్టికి స్థానికులు కోరారు. గోడకు బయలు బయో కంచెను ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటికి చర్యలు తీసు కోలేదు. త్వరితగతిన బయోకంచెను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## కవి సమయం

### యువత

కాలం విలువ తెలుసుకో
కాలానికి అనుకూలంగా మసలుకో
దురలవాట్లకు అవకండి మీరు బానిసలు
తల్లిదండ్రులు పెట్టుకున్నారు మీ మీద ఆశలు
అప్పులు చేసి మరీ చదివిస్తున్నారు చదువులు
వాళ్ళకి చెడ్డపేరు తేవద్దు మీరసలు
కావాలి మీరు అవినీతిని అరికట్టే సింహాలు
కావొద్దు మీరు ఉగ్రవాద పోషకులు
కాలం విలువ తెలుసుకో
కాలానికి అనుకూలంగా మసులుకో

... కవితా రచన
వైదా ఈశ్వరరావు

# పంచాంగం

మాసం : ఫాల్గుణ ; తిథి: పూర్ణిమ ఉ.6.32; బహుళ పాడ్యమి తె.5.06; పుబ్బ రా.11.04; ఉ.వ.7.40ల 9.13 తె.వ.5.05ల

శుక్రవారం 02-03-2018

**a మేషం:** ఉపాధ్యాయులకు, రిప్రజెంటేటివ్‌లకు సదవకాశాలు లభిస్తాయి. స్త్రీలకు తల, మెడ, నడుము, నరాలకు సంబంధించిన చికాకులు ఎదు ర్కొనక తప్పదు. వాతావరణంలో మార్పు వల్ల ఆరోగ్యం మందగిస్తుంది. వృత్తి వ్యాపారు లకు శ్రమాధిక్యత మినహా ఆశించినంత పురోభివృద్ధి ఉండదు.

**b వృషభం :** రాజకీయాల్లో వారి కార్యక్రమాలు వాయిదా పడుట వల్ల ఆందోళనకు గురవుతారు. మీ సరదాలు కోరికలు వాయిదావేసుకోవాల్సివస్తుంది భాగస్వామికుల మధ్య కొత్త విషయాలు చర్చకు వస్తాయి. ప్రముఖుల కలయిక వల్ల ఏమంత ప్రయోజనం ఉండదు. పెద్దల ఆరోగ్యం గురించి ఆందోళన కలిగిస్తుంది.

**c మిథునం :**వ్యాపారాల్లో గణనీయమైన పురోభవృద్ధి సాధిస్తారు. భార్యాభర్తల మధ్య అభిప్రాయ బేధాలు తలెత్తుతాయి. కలప, సిమెంట్, ఇసుక రంగాలలో వారికి లాభదాయకం. ఉద్యోగస్తులు కొత్త బాధ్యతలను సమర్థ వంతంగా నిర్వహిస్తారు. దీర్ఘకాలిక పెట్టుబడులు, కాంట్రాక్టులు అనుకూలిస్తాయి. స్త్రీలకు ఆహార, ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం.

**d కర్కాటకం :** స్థిరాస్తి కొనుగోలు వ్యవహారాలకు అనుకూలం. ఖర్చులు బాగా పెరిగే ఆస్కారం ఉంది. ధన వ్యయంలో ఏకాగ్రత అవసరం. ప్రముఖుల కలయిక సాధ్యము కాదు. ఉద్యోగస్తులు సమర్థవంతంగా పనిచేసి పై అధికారులను మెప్పి స్తారు. ఇసుక కాంట్రాక్టర్లకు అధికారుల నుంచి ప్రతికూలతలు ఎదుర్కొంటారు. మీ ఔన్నత్యాన్ని ఎదుటివారు గుర్తిస్తారు.

**e సింహం :** బ్యాంకు పనుల్లోను, వాహనం నడుపు తున్నప్పుడు ఏకాగ్రత వహించండి. ఒక వ్యవహారం నిమిత్తం ప్లీడర్లతో సంప్రదింపులు జరుపుతారు. ఒక శు భకార్యాన్ని ఘనంగా నిర్వహిస్తారు. స్త్రీల, ఆరోగ్యం క్రమంగా మెరుగు పడుతుంది. ఆదాయ వ్యయాలు సంతృప్తికరంగా ఉంటాయి. ఆత్మీయులను కలుసుకుని మీ బాధలు చెప్పుకోవాలనిపిస్తుంది.

**f కన్య :**కోర్టు వ్యవహారాలు పరిష్కరించబడుతాయి. రాబడికి మించిన ఖర్చులు, చెల్లింపుల వల్ల స్వల్ప ఆటుపోట్లు తప్పవు. క్రయ విక్రయాలు సంతృప్తికరంగా ఉంటాయి. వృత్తుల వారికి మంచి గుర్తింపు, శ్రమకు తగిన ఆదా యం లభిస్తుంది. స్త్రీలకు తమ మాటే నెగ్గా లన్న పంతం అధికంగా ఉంటుంది. బంధువులతో సత్సంబంధాలు నెలకొంటాయి.

**g తుల :** ఏజెంట్లు, బ్రోకర్లకు శ్రమాధిక్యత మిశ్రమ ప్రతిఫలంగా ఉంటుంది. మిమ్ములను చిన్నచూపు చూసిన వారే మీ ఔన్నత్యాన్ని గుర్తిస్తారు. తొందరపాటు నిర్ణయాల వల్ల నష్టపోయే ఆస్కారం ఉంది. నిరుద్యోగుల ఆలోచనలు ఉపాధి పథకాల దిశగా సాగుతాయి. స్త్రీలకు సంపాదన పట్ల ఆసక్తి, చుట్టుపక్కల వారి ప్రోత్సాహం లభిస్తుంది.

**h వృశ్చికం :** స్త్రీలకు ఏ విషయంలోను మనస్థిమితం అంతగా ఉండదు. కుటుంబీకుల మధ్య అనురాగవాత్సల్యాలు పెంపొందుతాయి. నిరుద్యోగులు భేష జాలకు పోకుండా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం ఉత్తమం. మీ సంతానం చదువుల కోసం ధనం బాగా వెచ్చిస్తారు. మీరు ఎవరికీ ఎటువంటి హామీలు ఇవ్వడం శ్రేయస్కరం కాదు.

**i ధనుస్సు :** ఉద్యోగస్తులు తోటివారితో విందులు, శుభ కార్యాల్లో పాల్గొంటారు. ఇతరులపై ఆధారపడటం మంచిది కాదని గమనించండి. మీ సంతానం పై చదువులు, ఆరోగ్య విషయాల పట్ల శ్రద్ధ వహిస్తారు. కొంతమంది మీ నుంచి ధనం లేక ఇతర్రతా సహాయం అర్థిస్తారు.


**j మకరం :** వృత్తి, ఉద్యోగ విషయాల్లో అందరితో స్నేహంగా ఉండే ప్రయత్నం చేయండి. భవిష్యత్తుకు ఉపయోగపడే నూతన పరిచయాలు బాగా జరుగుతాయి. ఆకస్మిక ప్రయాణాలు చేస్తారు. ఫైనా న్సు, బ్యాంకుల నుంచి పెద్ద మొత్తం ధనం డ్రా చేసే విషయంలో జాగ్రత్త వహించండి. కుటుంబ సభ్యుల ఆరోగ్య నిమిత్తం ఖర్చులు పెరుగుతాయి.

**k కుంభం :** ఉద్యోగస్తులకు కొత్తగా వచ్చిన అధికారులతో సత్సంబంధాలు నెల కొంటాయి. ఖర్చులు ఊహించినవి కావడంతో ఇబ్బంది లంతగా ఉండవు. ఉపా ధ్యాయులు ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. దీర్ఘకాలికంగా వేధిస్తున్న సమస్యలు పరిష్కా రమవుతాయి.

**L మీనం :** బ్యాంకు చెక్కులు ఇచ్చే విషయంలో పునరాలోచన మంచిది. కుటుం బీకుల మధ్య స్వల్ప విషయమే చిలికి చిలికి గాలి వానలా మారుతుంది. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారితీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి.

### సాయి గణపతి 'సివిల్' ఇంజనీరింగ్ విద్యార్థులు

# ఆక్సిజన్ టవర్స్ సందర్శన




ఆక్సిజన్ టవర్స్ నిర్మాణ, సాంకేతిక విలువలను విద్యార్థులకు వివరిస్తున్న ప్రాజెక్ట్ హెడ్ దుర్గా ప్రసాద్

విశాఖపట్నం: ఆనందపురం మండలం గిడిజాలలోని ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాల అయిన సాయిగణపతి ఇంజనీరింగ్ కళాశాల సివిల్ బ్రాంచ్ ఆఖరి సంవత్సరం విద్యార్థులు వైజ్ఞానిక సందర్శనలో భాగంగా రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన 'లాన్సమ్ హైట్స్' (ఆక్సిజన్ టవర్స్) బహుళ అంతస్తుల భవనమును సందర్శించారు. అత్యాధునిక సాంకేతికతతో భారీ భూకంపాలను సైతం తట్టుకునే విధంగా అధునాతన వసతులతో ఆక్సిజన్ టవర్స్ నిర్మించబడ్డాయని ప్రాజెక్టు హెడ్ దుర్గా ప్రసాద్ తెలిపారు. బహుళ అంతస్తుల భవనాల నిర్మాణంలో వాడిన మెటీరియల్, ఇంటీరియల్ డెకరేషన్స్ గురించి దుర్గా ప్రసాద్ విద్యార్థులకు వివరించారు. ఇదే కళాశాల విద్యార్థులు దీని నిర్మాణ సమయంలో ఇంటర్న్‌షిప్ చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కళాశాల కరస్పాండెంట్ ఎస్.వేణుగోపాల్ ఇండస్ట్రీ ఇనిస్టిట్యూషన్ ఇంటరాక్షన్ విభాగము ద్వారా పారిశ్రామిక సందర్శనలు, ఇంటర్న్‌షిప్‌లు విద్యార్థులకు అందిస్తున్నామని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.వి.జోషువా జయప్రసాద్ విద్యార్థులకు రియల్ టైమ్ ఎక్స్‌పీరియన్స్ (అనుభవం) కోసం వైజ్ఞానిక సందర్శనలు ఉపకరిస్తామని, ఇలాంటి సందర్శనలతో విద్యార్థులు ప్రాక్టికల్ నాలెడ్జ్, పరిశ్రమల పనితీరును తెలుసుకోగలరని అన్నారు. విశాఖలో నిర్మించబడిన ఆక్సిజన్ టవర్స్ విశాఖకే తలమానికమని ఆయన అన్నారు. ఈ వైజ్ఞానిక సందర్శనలో సివిల్ విభాగాధిపతి రఘు, అధ్యాపకులు దామోదర్, సింప, స్వాక్ అధికారి పి.జానీఖాన్ సహా ఫైనలియర్ సివిల్ విద్యార్థులు పాల్గొన్నారు.

# అభివృద్ధి సంక్షేమం తెదేపాతోనే సాధ్యం

సింధియా: రాష్ట్రంలోని అభివృద్ధి సంక్షేమం తెదేపాతోనే సాధ్యమని జీవీయంసీ 49వార్డు తెదేపా అధ్యక్షులు మజ్జిసోమేష్ అన్నారు. గురువారం మరిడిమాంభ కళ్యాణ మండపంలో జరిగిన ఫించన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాల ఉన్నతికోసం తెదేపా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని అన్నారు. వాటిని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఫించన్లుకు ధరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ఫించన్లు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాభివృద్ధికోసం అహర్నిషలు కృషి చేస్తున్నారని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విఫ్ పి. గణబాబు చొరవతో వార్డులోనిపలు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫించన్లు దారులు యుసిడి విభాగం అధికారులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ కార్మికుల వేతన ఒప్పందం వెంటనే చేయాలి



గాజువాక: కోరమండల్ కాంట్రాక్ట్ కార్మికుల వేతన ఒప్పందాన్ని వెంటనే చేయాలని ఏఐటియుసి ఆధ్వర్యంలో విశాఖ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ డిమాండ్ చేసింది. గురువారం ఇందుకు నిరసనగా బైక్ ర్యాలీ నిర్వహించారు. శ్రీహరిపురం జీవీయంసీ ఆసుపత్రినుంచి కోరమండల్ సంస్థ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటియుసి నాయకులు జి.రాంబాబు మాట్లాడుతూ కోరమండల్ యాజమాన్యం కాంట్రాక్ట్ లేబర్ పై నిరంకుశ ధోరణి అవలంభిస్తుందని, గుత్తేదారులకు ఒత్తాసు పలుకుతూ, వేతన ఒప్పందాన్ని తుంగలోకి తొక్కుతూ కాంట్రాక్ట్ లేబర్‌కు అన్యాయం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్ని సార్లు చెప్పిన కాలయాపన చేస్తున్నారని, కాంట్రాక్ట్ లేబర్‌కు అన్యాయం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని లేని యెడల పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోరమండల్ కాంట్రాక్ట్ లేబర్, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్ Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# అన్ని ఎస్సీ కాలనీల్లో కమ్యూనిటీ హాళ్లు నిర్మిస్తాం


మాట్లాడుతున్న ఎంపీపీ సుకల రమణమ్మ

నర్సీపట్నం : అన్ని ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాళ్లు నిర్మిస్తామని టిడిపి మండల అధ్యక్షులు లాలం శ్రీరంగస్వామి తెలిపారు. దళిత తేజం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఒఎల్‌పురం ఎస్సీ కాలనీలోని చెట్టు కింద మాట్లాడుతూ ఖాళీ ప్రదేశాలు ఉన్న చోట కమ్యూనిటీ హాళ్లు నిర్మించాలని మంత్రి అయ్యన్నపాత్రుడు ఆదేశించారు. దళితుల సమస్యలు గుర్తించి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన కల్పించడమే లక్ష్యమన్నారు. ఎంపిపి సుకల రమణమ్మ మాట్లాడుతూ చంద్రన్న బీమా, చంద్రన్న పెళ్లి కానుక వంటి వినూత్న కార్యక్రమాలు ప్రవేశపెట్టారన్నారు. రాష్ట్రంలో 16వేల కోట్ల అప్పుల్లో ఉన్నప్పటికీ ప్రజల క్షేమమే దళితుల అభివృద్దే ద్యేయంగా పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షులు గెడ్డం వరహారాజుమల్లు, టీడీపీ నాయకులు ఈర్లె రాజుబాబు, దళిత నాయకురాలు కోడి జ్యోతి, బీమా మిత్ర భావన పాల్గొన్నారు.

# నూకాలమ్మఅమ్మవారి మాల ధరించే భక్తులకు మాలలు, బట్టలు పంపిణీ



భీమినిపట్నం : భీమిలి గ్రామదేవత ట్రస్ట్ బోర్డు మండలి వారు నూకాలమ్మఅమ్మవారి మాల ధరించే భక్తులకు ట్రస్ట్ బోర్డు చైర్మన్ కాసారపు నాగరాజు . భీమిలి జోన్ టిడిపి అధ్యక్షులు గంటా నూకరాజు మాలలు బట్టలు ఈ రోజు పంపిణి చేశారు.ఈ సదర్భంగా ట్రస్ట్ బోర్డు చైర్మన్ కాసారపు నాగరాజు మాటలాడుతూ అమ్మవారిని ఈ నెల 3 న అర్ధరాత్రి 12 గంటలకు అమ్మవారిని తంగేటి పూల గరగ తో వీదుల్లో ఊరేగిస్తూ స్థానికి మార్కెట్ వద్ద వున్న అమ్మవారి చదును పట్టు వద్ద వుంచుతారని అన్నారు. నాలుగు ఉదయం అమ్మవారి భక్తులు మాలలు వేసుకొని పదకొండు రోజులు పాటు దీక్ష లో ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు మెంబర్స్ గాడు రవి విశ్వనాధం వేణుగోపాలరావు, ఎం.రవి, ఉత్సవ కమీటి అద్యక్షులు వాసుపల్లి కొండబాబు, సెక్రటరి గా గిడు తూరి శ్రీనివాసరావు , కోశాధికారి పలుకూరి శ్రీనివాసరావు (క్లబ్ శ్రీను), అర్గ నైజింగ్ సెక్రటరి గా గాడు అప్పల నాయుడు (ఆనంద్),కో ఆర్డినేటర్ గా కాసరపు ఎల్లాజీ ఉత్సవ కమీటి,సభ్యులు గాడు సన్యాసి నాయుడు, కదిరి జగన్నాదం, పి.యోగి, కొక్కిరి.అప్పన్న, అల్లిపిల్లి నరసింగ రావు, మైలపల్లి. నరసింగరావు,రాకోతు నరసింగరావు, ఎస్.జోగారావు తదితరులు పాల్గొన్నారు.

# భూ సేకరణ పనులను వేగవంతం చేయండి

## జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్



విశాఖపట్నం: బార్క్(బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్) ఏర్పాటుకు సంబంధించి భూ సేకరణ పనులను వేగవంతం చేసి మార్చి నెలాఖరు నాటికి సంబంధిత నివేదికను అందజేయా ల్సిందిగా జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో బార్క్ జాయింట్ సెక్రటరీ ఆర్.డి, ఎపిఐఐసి, రెవెన్యూ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అచ్యుతాపురం మండలంలో సుమారు నాలుగువేల ఎకరాలపైబడి బార్క్ ఏర్పాటుకు అవసరం వుందన్నారు. భూములకు సంబంధించిన ప్రభుత్వ ధరను నిర్ధారించాలన్నారు. సర్వే నెం.240లో గల తంతడి గ్రామంలో అనాధీన భూములకు సంబంధించి అవసరం వున్నది లేనిది తెలియజేయాల్సిందిగా బార్క్ జాయింట్ సెక్రటరీని కోరారు. ఆయా గ్రామాలలో భూములను కోల్పోయే నిర్వాసితులకు నష్టపరిహారం త్వరితగతిన అందజేయాలన్నారు. అదేవిధంగా బార్క్‌కు కేటాయించిన భూములలో అటవీశాఖ భూములు ఏమైన ఉంటే త్వరలో అటవీశాఖ అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి చర్చిస్తామన్నారు. ఈ సమావేశంలో బార్క్ జాయింట్ సెక్రటరీ అలెగ్జాండర్, రీజనల్ డైరక్టర్ వెంకటరత్నం, జాయింట్ కలెక్టర్ జి.సృజన, మిషాసింగ్, కెఎన్‌పి.సారధి, సత్తిబాబు, సూర్యకళ, రమణి, రామలక్ష్మి, అచ్యుతాపురం తహశీల్ధార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అధోగతి...చంద్రబాబు నీతి

## కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియరు నాయకులు బొత్స సత్యనారాయణ



విజయనగరం: రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఓటుకు నోటు కేసులో ఇరుక్కుపోయి రాష్ట్రానికి ప్రత్యేకహోదా కొరకు కేంద్రంపై ఒత్తిడి తేకుండా రాష్ట్రాని అధోగతి పాలు చేస్తూ, భావితరాల జీవితాలను సర్వనాశనం చేస్తున్నారని వై.యస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియరు నాయకులు బొత్స సత్యనారాయణ ఘాటుగా విమర్శించారు.జిల్లా వై.యస్సార్ కాంగ్రెస్ పార్టీ అద్వర్యములో కలక్టరు కార్యాలయం ఎదుట గురువారం మహాధర్నా జరిగింది. ముఖ్య అతిధిగా పాల్గొని ఆయన ప్రసంగిస్తూ..బి.జె.పి, టిడిపి ప్రజలకు మాయ మాటలు చెప్పి, వారి స్వప్రయోజనాల కొరకు పనిచేస్తూన్నాయన్నారు.మొదట రాష్ట్రానికి ప్యాకేజీ ముఖ్యమని చెప్పిన ముఖ్యమంత్రి ప్రజల ఆగ్రహాన్ని తెలుసుకొని మాట మార్చి ప్రత్యేక హోదా అంటున్నారని సత్తిబాబు అన్నారు.బి.జె.పి. రాష్ట్ర ఇన్‌చార్జిగా ఉన్న సిద్దార్ధ నాధ్‌సింగ్ ఒకసారి మాట్లాడుతూ తెలుగుదేశం రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఎప్పుడూ అడగలేదని చెప్పారని. హోదా కావాలంటే అడగమనండని చంద్రబాబునుద్దేశించి సిద్దార్ధనాథ్ సింగ్ అనడం చంద్రబాబు నాయుడికి ప్రత్యేకహోదా పట్ల చిత్త శుద్ధి లేదని ఆనాడే అర్ధమయ్యిందని సత్తిబాబు స్పష్టం చేశారు. అవినీతి ప్రజావ్యతిరేకంగా తమ హక్కులు సాధనకు పోరాడాలని సత్తిబాబు పిలుపునిచ్చారు. రాష్ట్రవిభజనతో నష్టపోతున్న జిల్లాకు గిరిజన యూనివర్సిటీ ప్రకటించి నిర్మాణం ప్రారంభించక కేవలం పదికోట్లు ప్రకటిం చడం ఏం సబబు అని కేంద్రాన్ని ప్రశ్నించారు. సాలూరు ఎమ్మెల్యే పిజరాజన్నదొర మాట్లాడుతూ నాడు రాష్ట్రమంత్రిగా పనిచేసిన బొత్స సత్యనారాయణ కృషిఫలితంగా జిల్లాకు 16 ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు చేసుకొని అర్హులైన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని అంటూ ఈ ప్రభుత్వ పాలనలో అధికార పార్టీ ఎమ్మెల్యేలే షిప్టు ఆపరేటర్లు, అంగన్‌వాడి తదితర ఉద్యోగాలకు వేలం పెట్టిమరి లక్షలకు అమ్ముకుంటున్నారన్నారు. కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి మాట్లాడుతూ గతంలో ప్రత్యే హోదా కొరకు విద్యార్దులు, యువకులు అద్యమాలు చేస్తే జైల్లో పెట్టిస్తామని హెచ్చరించిన చంద్రబాబు నాయుడు ఊసరవిల్లి సిగ్గు పదేలా నేడు ప్రత్యేక హోదా కావాలనడం సిగ్గు చేటన్నారు.పార్టీ జిల్లా సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చినశ్రీను) మాట్లాడుతూ దేశంలోని పొరుగు రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ సమానాభివృద్ధి సాధించాలంటే ప్రత్యేక హోదా ఒక్కటే మార్గమని ఆయన అన్నారు. బడ్జెట్ ఎలా ఉందని పాత్రికేయులు అడిగితే ఇంకా అద్యయనం అశోక్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందని శ్రీనివాసరావు పేర్కొన్నారు. 2019ఎన్నికలలో ప్రజల తీర్పు నుండి చంద్రబాబు, అశోక్‌లు తప్పించు కోలేరని శ్రీనివాసరావు హెచ్చరించారు.ధర్నాలో బెల్లాన చంద్రశేఖర్, ఎస్.పరీక్షిత్‌రాజుపార్టీ సీనియరు నేత డి.సాంబ శివరాజు, మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, సిపిఐ కార్యదర్శి పి.కామేశ్వర్‌రావు , సిపిఎమ్ కార్యదర్శి తమ్మినేని సూర్య నారా యణ, జైహింద్ కుమార్, డా॥ సురేష్, జామ్మాన ప్రసన్న, అలజంగి జోగారావు, నెక్కలి నాయుడుబాబు, ఏకెవి జోగి నాయుడు, కడు బండి శ్రీనివాసరావు, యడ్ల రమణమూర్తి, పిళ్ళా విజయకుమార్, చనమల్ల వెంకటరమణ, కె.వి.సూర్య నారాయణరాజు, శ్రీరాములునాయుడు, విజయ్, అప్పల నాయుడు, మన్మధకుమార్, ఎం.ఎల్.ఎన్.రాజు పాల్గొన్నారు.

# బిసి కార్పొరేషన్ ద్వారా ఆటోలు పంపిణీ


ఆటోలు అందజేస్తున్న ఎంపీపీ

నర్సీపట్నం : బిసి కార్పొరేషన్ ద్వారా ఆటోలను ఎంపిపి సుకల రమణమ్మ గురువారం పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వినియోగించుకొని యువత స్వయం ఉపాధిపై దృష్టిసారించాలని ఆమె కోరారు. ధర్మసాగరంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుకల లోవ, పెట్ల రామకృష్ణకు ఈ ఆటోలను బిసి కార్పొరేషన్ ద్వారా ఇచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు సుకల అప్పలనాయుడు పాల్గొన్నారు.

# అవంతి విద్యార్థులు ప్రతిభ



భీమునిపట్నం : తగరపువలస అవంతి ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ లో ఎం.బి.ఏ. మొదటి సంవత్సరం చదువు చున్న విద్యార్థులు మిరాకేల్ కాలేజీ లో జరుగుచున్న జఎశీష్ట్రఖ-18 ఈవెంట్ లో పాల్గొన్నారు.ఈ మేనేజ్మెంట్ ఈవేంట్ లో అవంతీ కాలేజీ విద్యార్థులు ఈ ఈవెంట్ లో జి.ఆదిత్య, డి.రాజేష్,లు ద్వితీయ స్థానం అలాగే సాంస్కృతిక పోటిల్లో వరలక్ష్మి కి ద్వితీయ స్థానం లో గెలుపొందారు.వీరిని అవంతీ కాలేజ్ హెచ్.ఆర్. డైరెక్టర్ ఎ.చంద్ర శేఖర్, ఎస్.వి.రాఘవరావు,కళాశాల ప్రిన్సిపల్ కృష్ణయ్య అభినందించారు.

# విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల పోరాటం న్యాయసమ్మతమైనది

## డిసిసి జిల్లా అధ్యక్షుడు యడ్ల ఆదిరాజు



విజయనగరం : గత పదిరోజులుగా దాసన్నపేట విద్యుత్ భవనం వద్ద కొనసాగుతున్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల దీక్ష శిబిరానికి గురువారం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు యడ్ల ఆదిరాజు సంగీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆదిరాజు మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల పోరాటం న్యాయ సమ్మతమైనదని, కార్మికులను రెగ్యులరైజేషన్, ఉద్యోగభద్రత, సమానపనికి సమానవేతనం, థర్డ్‌పార్టీ, పీస్‌రేటు విదానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమానపనికి సమానవేతనం ఇవ్వాలన్న సుప్రీం కోర్టు తీర్పును గౌరవించాలన్నారు. 2014 ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజేషన్ చేస్తానని హామీ ఇచ్చి ఇప్పటికి నెరవేర్చకపోవడం దారుణమన్నారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల న్యాయసమ్మతమైన డిమాండ్ కోసం కాంగ్రెస్ పార్టీ చివరివరకు పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బొంగ భానుమూర్తి, డోల శ్రీనివాస్, సేనమనేటి శ్రీనివాసరావు, షేక్ ఖలీల్, మురళి తదితరులు పాల్గొన్నారు.

# మరుగుదొడ్ల వేగవంతం చేయాలి



రోలుగుంట : మరుగుదొడ్లు నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి ఆనందరావు అన్నారు. గురువారం రోలుగుంట మండలం అడ్డసారం గ్రామంలో మరుగుదొడ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి మరుగుదొడ్లు నిర్మాణాలు పరిశీలించారు. కొన్ని చోట్ల పూర్తికాని మరుగుదొడ్ల లబ్ధిదారులతో ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. తాపీమేస్త్రీలు దొరకడం లేదని చెప్పగా పక్క ఊరు నుంచి తెచ్చుకోవాలని, లేకుంటే రేషన్, కరెంట్ నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.అప్పారావు, ఏపిఒ కాశీ, సెక్రటరీ శివ పాల్గొన్నారు.

# ఎవ్యాపార, ఇంటి పన్నులు 28 కోట్లు ద్వేయం

## డిపిఒ కృష్ణకుమారి

కొయ్యూరు : మండల కేంద్రంలో ఎంపిడిఒ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి డిపిఒ కృష్ణకుమారి, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఇంటి పన్నులు కట్టించాలని, 2017-2018 సంవత్సరం గాని 28 కోట్లు ఇంటి పన్నులు, వ్యాపార పన్నులు, సంబంధించి 28 కోట్లు జిల్లా వ్యాప్తంగా పూర్తి చేయాలన్నారు. 2016-2017 సంబంధించి 28 కోట్లు జిల్లా వ్యాప్తంగా పూర్తి చేయాలన్నారు.


## ఎస్సై అశోక్‌కుమార్‌కు

# ఘనంగా వీడ్కోలు


ఎస్సై అశోక్‌కుమార్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

నాతవరం : నాతవరం ఎస్సైగా పనిచేసి బదిలీపై వెళ్తున్న అశోక్‌కుమార్‌కు బుధవారం రాత్రి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎంపిపి సన్యాసిదేముడు మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో అంకిత భావంతో పని చేసినందుకు ఈ సన్మానం చేయడం జరిగిందని చెప్పారు. మండలంలో అందరి తోనూ ఆయన మంచితనంగా మెలిగారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక జెడ్పీటీసీ కరక సత్యనారాయణ, తాండవ ప్రాజెక్టు చైర్మన్ పారుపల్లి కొండబాబు, స్థానిక ఎంపిటిసి అపిరెడ్డి మాణిక్యం, సీఐ రేవతమ్మ, నాతవరం నూతన ఎస్సై సత్యనారాయణ, యువత గ్రామానికి చెందిన సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కారు ఢీకొని వ్యక్తి మృతి



భీమునిపట్నం : కారు ఢీకొన్న సంఘటన లో వ్యక్తి మృతి చెందిన సంఘటన స్థానిక సంగివలసలో జరిగింది. పోలీసులు ఇచ్చిన వివరాల ప్రకారం బుధవారం రాత్రి పది గంటల సమయంలో విజయనగరం కు చెందిన ప్రహర రాజు విశాఖ నుంచి విజయనగరం తన కారులో బయలుదేరి వెలుతున్నారు. కాగా సంగివలస మూడు గుళ్ళు సమీపంలో కారు ను త్రిప్పుతుండగా ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వ్యక్తిని ఢీ కొనడం తో అతనికి బలమైన గాయాలయ్యాయి. దాంతో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.మృతుని వివరాలు తెలియాల్సి ఉంది. భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# సందడిగా కోలగట్ల నివాసం

## శ్రావణి వివాహానికి నేతల రాకతో కోలాహలం



విజయనగరం : శాసనమండలి సభ్యులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర కన్వీనర్ కోలగట్ల వీరభద్రస్వామి ద్వితీయ కుమార్తె శ్రావణి వివాహం సందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు రాకతో కోలగట్ల నివాసంలో సందడి నెలకొంది. గురువారం మధ్యాహ్నం రాజ్యసభ సభ్యులు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వి.విజయసాయిరెడ్డి, రాష్ట్ర పార్టీ నాయకులు బొత్స సత్యనారాయణ, పార్టీ నాయకులు కోలగట్ల నివాసానికి తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు తరలిరాగానే ఎమ్మెల్సీ కోలగట్ల వీరికి సాదరస్వాగతం పలికారు. అనంతరం పెళ్లికుమార్తె శ్రావణిని విజయసాయిరెడ్డి, బొత్స సత్యన్నారాయణలు ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన జీవితంలో అడుగుపెడుతున్న శుభవేళ మరింత ఉజ్వల భవిష్యత్‌తో ఆనందకర జీవితం గడపాలని అభినందించారు. విజయసాయిరెడ్డి, బొత్స వెంట సాలూరు శాసనసభ్యులు పి.రాజన్నదొర, జిల్లా పార్టీ వ్యవహారాల సమన్వయ కర్త మజ్జి శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర నాయకులు గుబ్బా చంద్రశేఖర్, పార్టీ జిల్లా నాయకులు అల్లు జోగినాయుడు, దొంగళి జగన్నాధం, మాజీ ఎమ్మెల్యే కుంబా రవిబాబు, జిల్లా మహిలా నాయకురాలు రెడ్డి పద్మావతి, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములు నాయుడు, ఎంఎల్ఎన్ రాజు తదితరులు కోలగట్ల కుమార్తెకు శుభాశీస్సులు అందజేశారు.

## సరుగుడులో తాగునీటి సమస్య తీర్చాలి

నాతవరం : సరుగుడు పంచాయతీలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని బిజెపి నాయకులు అధికారులను కోరారు.

డాక్యుమెంట్స్ పోయినవి
రైల్వే ఫీడర్సు రోడ్డు వద్ద గల జెరాక్స్ షాపు నందు బుధవారం అనగా 28-02-2018వతేదీన డాక్యుమెంట్సు జెరాక్సు తీసుకొని M.R.O.ఆఫీసుకు వెళుతుండగా నా భూమికి సంబంధించిన డాక్యుమెంట్స్ నెం: 1703/1923, 143/1937, 46/1966లు గల డాక్యుమెంట్స్ వున్న ఫైలు పోయినది. ఆచూకి లభ్యమైన యెడల క్రింది ఫోన్ నెంబరుకు తెలియజేయగలరు.
పెద్దిరాజు కేశవులు
సెల్ నెంబర్ : 7097544387

వెన్నెల ఫంక్షన్ హాల్ ఫ్రీ
హోటల్ అరిటాకు
ఎన్.ఎ.డి. జంక్షన్, వైజాగ్.
అతి తక్కువ రేట్లకే క్యాటరింగ్ & హాస్టల్స్
ఆఫీస్‌లకు ఫుడ్ సప్లయ్ హోటల్‌లో రూ. 79/-లకే
30 రకాల ఐటమ్స్‌తో విందు భోజనం
72889 99970

DISTANCE EDUCATION
B.a., B.Com., B.Sc., M.A., M.Com., M.Sc., All Groups
GRACE ACADEMY
SBI మేడపైన - సబ్బవరం
77806 64414, 99666 99633

DSC + TET
SGT - & S A Social Group IV & Group VRO - VRA
క్లాసులు ప్రారంభమయినవి
GRACE ACADEMY
SBI మేడపైన - సబ్బవరం
77806 64414, 99666 99633

### భక్తుల కోలాహలం మధ్య

# అంగరంగ వైభవంగా రథోత్సవం





యానాం : శ్రీ భుసమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలలో భక్తుల కోలాహాలం మధ్య అంగరంగ వైభవంగా రథోత్సవాన్ని నిర్వహించారు. గురువారం సాయంత్రం కె.జంక్షన్‌లో దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కల్యాణ మహోత్సవాలలో పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు, పరిపాలనాధికారి దవులూరి సుబ్రమణ్యేశ్వరరావు, ఎస్‌పి. నితిన్‌గౌహల్ ప్రత్యేక పూజల అనంతరం వెంకన్న నామస్కరణం భక్తుల కోలాహాలం మధ్య భారీ ఎత్తున బాణాసంచాకాల్పు మధ్య రథాన్ని కొత్తబస్టాండ్ వరకు ఊరేగించేరు. దారిపొడుగున భక్తులు రథంపైకి అరటిపళ్ళు విసురుతూ ఆనవాయితీని కొనసాగించారు. రథంపైకి అరటిపళ్ళు విసరండంవలన అనుకున్న పనులు జరుగుతాయని నమ్మికతో భక్తులు పోటీపడ్డారు. దారిపొడువునా యానాం వెంకన్నకు భక్తులు పూజలు నిర్వహించారు. దారిమధ్యలో రథం మొరాయించడం జరిగింది. రథోత్సవం కొత్తబస్టాండుకు చేరుకున్న అనంతరం వేదపండితుల సమక్షంలో పూజలు నిర్వంహించారు. భక్తులు బారులుతీరి పూజలు నిర్వహించారు. దేవస్థాన కమిటీ చైర్మన్ గందం శంకరరావు, భక్తులకు సౌకర్య ఏర్పాట్లను పర్యావేక్షించారు. పుదుచ్చేరి హెడ్ క్వార్టురు ఎస్‌పి పండా వెంకటేశ్వరరావు స్వామివారికీ పూజలు నిర్వహించి ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. సిఐ గిడ్ల సత్యనారాయణ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎస్‌ఐలు వి. శివకుమార్, కె. సుబ్బరాజు, బి అల్పన్స్‌రాజు, బి. కనకారావులు పోలీసులు, ఐఆర్‌పి కానిస్టేబుల్స్ భద్రతా ఏర్పాట్లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గిడ్ల చంద్రరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు, ఎం. సుబ్బారావు, కె. కొండబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యేక్షులు, ఎంఎ సిరాజ్దీన్, భూపతిరాజు రాముురాజు, అన్నాడిఎంకె కార్యదర్శి ఎం. సత్యసాయికుమార్, వేలాదిమంది భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల పరిశీలన

యానాం : ఐలాండ్ 5 లో జరుగుతున్న పర్యాటక అభివృద్ధి పనులను పర్యాటకశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు పరిశీలించారు. గురువారం ఉదయం గోదావరి మధ్యలో ఉన్న ఐలాండ్-5లో ప్రజా పనుల శాఖ ద్వారా సుమారు. రూ. 9 కోట్ల వ్యయంతో జరుగుతున్న గ్రానైట్ వాక్‌వై , బాంబే హౌసెస్ నిర్మాణపనులు ఆయన పరిశీలించారు. నిర్మాణ పనుల నత్తనడకన సాగడం పై సంబంధిత అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. కాలపరిమితిలోగా అభివృద్ధి పనులు పూర్తిచేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని నణ్యాతా ప్రమాణాలతో పనులు ఉండాలని ఆయన సూచించారు. త్వరతగతిన పనులు పూర్తిచేయకపోతే సంబంధితలపై చర్యలు తప్పవన్నారు. ఈయన వెంట ప్రజాపనుల శాఖ ఇఇ రాందాసు, జెఇ. వెంకన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

# నిక్‌నెట్ డాక్యుమెంటరీ ఆవిష్కరణ




యానాం : యానాం నియోజకవర్గంతో నిక్‌నెట్ ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాల డాక్యుమెంటరీని పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు ఆవిష్కరించారు.

గురువారం ఉదయం స్థానిక పరిపాలనాధికారి కార్యాలయం లో పరిపాలనాధికారి దవులూరి సుబ్రమణ్యేశ్వర రావు అధ్యక్షతన నిక్‌నెట్ సైంటిస్టులు ఎస్. మధుసూధనరావు, శ్యామలరావులు ఏర్పాటు చేసిన డాక్యుమెంటరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిధిగా విచ్చేసి ఆవిష్కరించారు. గత 21 సంవత్సరాలుగా నిక్‌నెట్ ద్వారా చేస్తున్న సేవలు పుదుచ్చేరి రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు ఇస్తున్న సమాచార విజ్‌వెల్స్‌ను ఈ సందర్భంగా టివిలో తిలకించారు. నిక్‌నెట్ సైంటిస్టు ఎస్ మధుసుధనరావు యానాం నుండి అమరావతికి బదలీ అయిన సందర్భంగా ఆయన సేవలును కొనియాడుతూ మంత్రి మల్లాడి ఆయనను ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ జి. గౌరీసరోజ, వ్యవసాయ శాఖ డిడి శివశంకర్ మురుగన్, విద్యాశాఖ అధికారి కాలే సాయినాద్, ప్రజాపనుల శాఖ ఇఇ రామదాసు, ఎఇ మేడిశెట్టి శ్రీనివాసు, సిఐ జి. సత్యనారాయణ, మత్స్యశాఖ ఎడి డి. దొంతయ్య, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పరవాడ ఫార్మలో

# ఫర్ రిస్కీ మిటిగేషన్ సెంటర్ ప్రారంభం

### ముఖ్యఅతిథిగా హజరైన ఎమ్మెల్యే బండారు



పరవాడ: మండలంలోని జవహర్ లాల్ నెహ్రు ఫార్మాసిటీలో నూతనంగా నిర్మించిన మ్యూచివల్లీ ఎయిడెడ్ సోసైటీ ఫర్ రిస్క్ మిటిగేషన్ సెంటర్‌ను గురువారం ఉదయం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్య నారాయణమూర్తి హజరై అతని చేతులు మీదగా ప్రారంభించారు. ఈ సందర్బంగా బండారు మాట్లాడుతూ ప్రపంచలోని అన్నిట్టికంటే విలువైనది మానవవనరులు అని అన్నారు. పరిశ్రమలన్ని కార్మికుడికి భద్రత,ఆరోగ్యం లకు మెదటి ప్రాదాన్యత ఇవ్వాలన్నారు. ఈ సోసైటీ లో 72 పరిశ్రమలు బాగస్వాములు కావడం మంచి పరిణామం అని అన్నారు. కార్మికులకు భద్రత పై శిక్షణ ఇచ్చేందుకు ఎపిఐఐసితో మాట్లాడి స్దలమును ఇచ్చేందుకు కృషి చేస్తానని హామి ఇచ్చారు. త్వరలోనే 30 పడకల ఆసుపత్రి ప్రారంభింస్తామన్నారు. అనంతరము అయన ఎమర్జన్సీ వెహికీల్ ప్రారంబించారు. అన్నిపరిశ్రమలవారు ఈసోసైటీనీ వినియోగించుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో మ్యూచివల్లీ ఎయిడెడ్ సోసైటీ ఫర్ రిస్కీమిటీగేషన్ అద్య క్షులు ఎమ్ .శివరామ్ ప్రసాద్, సోసైటీకార్యదర్శి జె.సుబ్బా రావు, వైస్ ప్రెసిడెంట్ యస్.యస్.రావు, పరవాడ జిల్లా ప్రాదేశిక సభ్యులు పైల జగన్నాధరావు, పరవాడ ఎంపిపి మాసవరపు అప్పలనాయుడు, సౌత్ ఎసిపి రామ్మోహరావు, పరిశ్రమల సంచారుకులు బాలకిషోర్, ఫ్యాక్టరీ ఆప్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ , పరవాడ సిఐ స్వామి నాయుడు, పార్మా పరిశ్రమల యాజమాన్యాలు పాల్గొన్నారు

## నేడే యానాం రానున్న సైకిల్ ర్యాలి


యానాం : పర్యావరణ పరిరక్షణ ప్రజలందరికీ సంపూర్ణఆరోగ్యంపై అంగాహన కల్పించే లక్ష్యంతో ఎపిఎస్‌పిఎఫ్ అడిషనల్ డిజి మాదిరెడ్డి ప్రతాప్ చేపట్టిన సైకిల్ ర్యాలీ శుక్రవారం యానాం చేరుకోనున్నది. కాకినాడ, జగన్నాధపురం ఘాటీ దగ్గర నుండి ప్రారంభ కానున్న సైకిల్ ర్యాలీ గొల్లపాలెం మీదుగా ద్రాక్షారం చేరుకొని అక్కడ నుండి యానాం రానున్నట్లు ఎఎస్ఐ ఎస్ లక్ష్మణరావు, కానిస్టేబుల్స్ ఆర్ బాలక్రిష్ణా, కె. ఆదాంలు తెలిపారు. దారిపొడువునా ప్రజలకు పర్యావరణంపై, వైద్యంపై కరపత్రాలద్వారా అవగాహన కల్పించే దిశగా ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## ప్రమాదవశాత్తు ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి



తాళ్లరేవు : గోవలంక ఏటిగట్లు రోడ్డు మార్గంలో కొత్త కొంపలు గ్రామం వద్ద ప్రమాదవశాత్తు ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ బండారు లంకకు చెందిన సుధా సూరిబాబు (45) అక్కడికక్కడే మృతి చెందినట్లు కోరంగి ఎఎస్ఐ కె.ఎస్.ఎన్. మూర్తి తెలిపారు. గురువారం ఉదయం అమలాపురం నుండి యానాం మీదుగా మసకపల్లి ఇసుక ర్యాంపుకు వెళ్తుండుగా ప్రమాదవశుత్తు ఈ దుర్ఘటన జరిగిందన్నారు. ఏటిగట్టు వైపుకు ట్రాక్టర్ తిరగబడటంతో దానిక్రిందపడి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు తెలిపారు.

# జయేంద్ర సరస్వతి శివైక్యం పట్ల సంతాపం



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ సత్యదేవుని సన్నిధిలో వ్రత పురోహితులు కంచి కామ కోటి పీఠాధిపతి శ్రీ శ్రీ జయేంద్ర సరస్వతి శివైక్యం పట్ల గురువారం సంతాపము వ్యక్తం చేసారు. వ్రత పురోహితులు సమావేశమై జయేంద్ర సరస్వతి శివైక్యం పొందినందుకు పది నిమిషాలు మౌనం పాటించి ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వ్రత పురోహిత పెద్దలు మాట్లాడుతూ హిందు భారతావనిలో హిందూ మతానికి సర్వోత్తమమైన వ్యక్తిగా అందరూ అభిలషించే వారన్నారు. భారతదేశంలో ఉన్న దెవాలయాల పవిత్రతకు భంగము వాటిల్ల కుండా ప్రముఖ పర్యవేక్షకులిగా ఉన్న వారిలో ఒక్కరైన శ్రీ జయేంద్ర సరస్వతి వారు అకస్మాత్తుగా శివైక్యం చెందడం జీర్ణించుకోలేకపోతునాము అన్నారు.సనాతన ధర్మముపై ఎన్ని ఒత్తిడిలు వచ్చినా నిర్బయంగా, ముక్కు సూటిగా మాట్లాడడం శ్రీ జయేంద్ర సరస్వతికే చెందిందన్నారు.

# ప్రత్యేక హోదాపై కలెక్టరేట్ వద్ద వైకాపా నేతలు ధర్నా

అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్.జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు ప్రత్తిపాడు నియోజకవర్గం నమన్వయ కర్త పర్వత.పూర్ణచంద్ర ప్రసాద్ ఆద్వర్యంలో ప్రత్యేక హోదాపై కాకినాడలోని కలెక్టర్ కార్యాలయం ముందు ప్రత్యేక హోదాపై ధర్నా చేసారు. ఈ సందర్భంగా పర్వత.పూర్ణచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ రాష్టానికి ప్రత్యేక హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ ఇటీవల కేంద్ర బడ్జెట్ లో రాష్ట్రానికి జరిగిన అన్యాయముపై వ్యతిరేఖిస్తూ ప్రత్యేక హోదాపై బిజేపి,టిడిపి ద్వంద్వ వైఖరిని వహిస్తున్నాయి అన్నారు.ఈ కార్యక్రమంలో అన్నవరం వైసిపి టౌన్ అధ్యక్షుడు రాయవరపు.భాస్కరరావు, మాజీ యంపీపీ శెట్టిబత్తుల.కుమార్ రాజా,బివిస్వీ. ప్రసాద్, బత్తుల. రవికుమార్, తాడి. సత్య నారాయణ, గణేశుల.లక్ష్మణస్వామి, సరమర్ల. మోషేరావు, బండారు.అర్జునరావు, సింగంపల్లి. రాము, తాటిపాక.కృష్ణ, చల్లా.ప్రసాద్, కాంద్రకోట. రాజు, నవుడు.దేవుడు, రయలాపురం.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి సంక్షేమం తెదేపాతోనే సాధ్యం



సింథియా: రాష్ట్రంలోని అభివృద్ధి సంక్షేమం తెదేపాతోనే సాధ్యమని జీవీయంసీ 49వార్డు తెదేపా అధ్యక్షులు మజ్జిసోమేష్ అన్నారు. గురువారం మరిడిమాంభ కళ్యాణ మండపంలో జరిగిన ఫింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాల ఉన్నతికోసం తెదేపా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని అన్నారు. వాటిని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఫించన్లుకు ధరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ఫించన్లు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాభివృద్ధి కోసం అహర్ని షలు కృషి చేస్తున్నారని అన్నారు.

స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విఫ్ పి. గణబాబు చొరవతో వార్డులోని పలు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫించన్లు దారులు యుసిడి విభాగం అధికారులు పాల్గొన్నారు.

## పెద్దాపురంలో పెరుగుతున్న ఎండతీవ్రత

పెద్దాపురం : మెట్టప్రాంతం కావడం, నీటినిలువలు లేకపోవడం, కాలువలు, చెరువులు లేకపోవడం వంటి నీటి కొరత కారణంగా పెద్దాపురం పట్టణంలో మార్చి మొదటి నుండి ఎండ తీవ్రత పెరుగుతున్నది. ఉష్ణోగ్రత పెరగడం వలన ప్రజలు ఎండతాపాన్ని, తీవ్రతకు తట్టుకోలేకపోతున్నారు. ఇప్పటి నుండే ఇంత తీవ్రత రావడంతో రానున్న మూడు నెలలో పట్టణ ప్రజలు తీవ్ర తపానికి తట్టుకోవడం కష్టమని భయపడుతున్నారు. మెట్టప్రాంతం కావడం, రోడ్లు విస్తరణ పనులలో వందల ఏళ్ళనాటి వృక్షాలు తొలగించడం, తారు, సిమ్మెంటు రోడ్లు వేయడంతో ఎందతీవ్రత తట్టుకోవడంపై ప్రజు భయబ్రాంతులు అవుతున్నారు.

## సత్యదేవున్ని దర్శించిన సినీ హీరో సుమన్



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివార్ని సినీ హీరో సమన్ దర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో పిఆర్వో తులా. రాముడు, ఎఇవో వైయస్ఆర్ మూర్తి ఘన స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేద పండితులు ఆశీర్వాదము అనంతరం శ్రీ స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్ స్పెక్టర్ పోల్నాటి. లక్ష్మీనారాయణ, సూపరింటెండెంట్ నాగభూషణం, ఆరై.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా అశ్వ వాహన, రథోత్సవం



రావులపాలెం : రావులపాలెంలో వేంచేసియున్న శ్రీ అలివేలు మంగా పద్మావతి, ఆండాళ్ సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి నవమ వార్షిక కళ్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయ అర్చకులు ఖండవల్లి రాజేశ్వర వర ప్రసాదాచార్యులు, వాడపల్లి కమల నాదాచార్యులు బ్రహ్మత్వంలో సరస్వతి హెూమం ఘనంగా నిర్వహించారు. అనంతరం వందలాది మంది జనసందోహంతో గోవింద మాలదారుల గోవింద నామస్మరణలతో, కోలాట బృందాలతో, రామ డోలు వాయిద్యాలతో, కేరళ వాయిద్యాలతో, భక్తజన సందోహ భగవన్నామ స్మరణలతో అత్యంత వైభవంగా కన్నుల పండుగగా ఆలయ కమిటీ సభ్యులు రథోత్సవం ఘనంగా నిర్వహించారు. రాత్రి అశ్వవాహనోత్సవం గ్రామ పుర వీధులలో కన్నుల పండుగగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పడాల పెద వెంకటరెడ్డి, పడాల బాపిరెడ్డి, మేడపాటి సూర్యనారాయణ రెడ్డి, కొవ్వూరి నాగిరెడ్డి, బ్రహ్మశ్రీ ఖండవల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు, అప్పన గంగాధర రావు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## బాబా ఆలయంలో పెన్నుల పూజ



రావులపాలెం : స్థానిక షిర్డిసాయి బాబా ఆలయంలో పెన్నుల పూజ నిర్వహించారు. అర్చకులు పి. జనార్ధన కేశవమూర్తి, సుదర్శనం నరసింహాచార్యులు, విష్ణుభట్ల మురళీ కృష్ణలు బాబా వార్కి ప్రత్యేక పూజలు నిర్వహించి, పాదాల చెంత గురువారం 5 వేల పెన్నులు పూజ నిర్వహించారు. అనంతరం పెన్నుల వితరణ దాత మారుతి కనష్ట్రక్షన్స్ అధినేత గొలుగూరి వెంకటరెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు పెన్నుల వితరణ చేసారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పోతంశెట్టి కనికిరెడ్డి, మల్లిడి కోటేశ్వరరెడ్డి, పడాల సుబ్బారెడ్డి, కమిటీ సుభ్యులు అధిక సంఖ్యలో భక్తులు, విద్యార్ధులు పాల్గొన్నారు.

# చిత్రభాను

## రికార్డు ధరకు సాక్ష్యం శాటిలైట్..





దర్శకుడు శ్రీవాస్, హీరో బెల్లంకొండ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న "సాక్ష్యం" తాజా షెడ్యూల్ ప్రస్తుతం రామోజీ ఫిలిమ్ సిటీలో జరుగుతోంది. బెల్లంకొండ శ్రీనివాస్ సరసన సెన్సేషనల్ బ్యూటీ పూజా హెగ్డే హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రాన్ని అభిషేక్ పిక్చర్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత అభిషేక్ నామా నిర్మిస్తున్నారు. ఈ డిఫరెంట్ యాక్షన్ ఎంటర్ టైనర్ ను మే 11న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నది. ఈ చిత్ర శాటిలైట్ హక్కులు రికార్డు స్థాయిలో అమ్ముడు పోవడం పరిశ్రమలో సంచలనం రేపింది.

సాక్ష్యం చిత్రం శాటిలైట్ హక్కులు (తెలుగు, హిందీ) 13.5 కోట్ల రూపాయలకు అమ్ముడుపోవడం మార్కెట్‌లో విపరీతమైన అంచనాలు పెరిగిపోయాయి.

జీ సంస్థ "సాక్ష్యం" తెలుగు శాటిలైట్ హక్కుల్ని తెలుగు-5.5 కోట్లు, హిందీ-8 కోట్ల రూపాయలకు కొనడం విశేషం. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా విడుదల చేసిన బెల్లంకొండ శ్రీనివాస్-పూజా హెగ్డేల ఫస్ట్ లుక్ కు కూడా విశేషమైన స్పందన లభించింది. భారీ బడ్జెట్‌తో సాక్ష్యం ప్రస్తుతం రామోజీ ఫిలిమ్ సిటీలో భారీ సెట్స్ వేసి షూటింగ్ జరుగుతోంది. నిర్మాణ విలువల పరంగా ఎక్కడా రాజీపడకుండా అభినేష్ నామా ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో తెరకెక్కిస్తున్నారు. ఓ యువ హీరో చిత్రానికి ఈస్థాయిలో శాటిలైట్ బిజినెస్ జరగడం అనేది ఇదే మొదటిసారి.

మే 11న విడుదల చిత్రబృందం ఆఖరి షెడ్యూల్ కోసం త్వరలో అమెరికా వెళ్లనున్నారు. అమెరికాలో చిత్రించబోయే కీలక సన్నివేశాలతో చిత్రీకరణ పూర్తవుతుంది.

మే 11న ప్రపంచవ్యాప్తంగా విడుదలవ్వనున్న "సాక్ష్యం" ష్యూర్ షాట్ హిట్ అవుతుందని చిత్రబృందం నమ్మకం వ్యక్తం చేస్తోంది. నటీనటులు, సాంకేతికవర్గం బెల్లంకొండ శ్రీనివాస్, పూజా హెగ్డే, జగపతిబాబు, శరత్ కుమార్, మీనా, వెన్నెల కిషోర్, జయప్రకాష్, పవిత్ర లోకేష్, బ్రహ్మాజీ, రవికిషన్, అశుతోష్ రాణా, మధు గురుస్వామి, లావణ్య తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కళ: ఏ.ఎస్.ప్రకాష్, కూర్పు: కోటగిరి వెంకటేశ్వర్రావు, సినిమాటోగ్రఫీ: ఆర్థర్ ఎ.విల్సన్, మాటలు: సాయిమాధవ్ బుర్రా, యాక్షన్: పీటర్ హైన్స్, సంగీతం: హర్షవర్ధన్, నిర్మాణం: అభిషేక్ పిక్చర్స్, నిర్మాత: అభిషేక్ నామా, రచన-దర్శకత్వం: శ్రీవాస్!

## నానితో త్రివిక్రమ్ సినిమా..





టాలీవుడ్ లో న్యాచురల్ స్టార్ నాని మాయ కొనసాగుతోంది. యావరేజ్ టాక్ సొంతం చేసుకున్న చిత్రాలుకూడా నాని క్రేజ్ తో సూపర్ హిట్ అయిపోతున్నాయి. ఆడియన్స్ నే కాదు నాని దర్శకులని సైతం మాయ చేయడం మొదలు పెట్టాడు. నాని ఎక్కువగా కొత్త దర్శకుడీలతో, ఓ మోస్తరు క్రేజ్ ఉన్న దర్శకులతోనే సినిమాలు చేస్తున్నాడు.

కాగా నాని.. త్రివిక్రమ్ లాంటి స్టార్ డైరెక్టర్ తో సినిమా చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఇండస్ట్రీలో న్యూస్ చక్కర్లు కొడుతోంది. టాలీవుడ్ లో నాని తిరుగులేని హీరోగా దూసుకుపోతున్నాడు. గత ఏడు చిత్రాలనుంచి నానికి పరాజయమే లేదు. నాని సినిమాలు బాక్స్ ఆఫీస్ వద్ద నిర్మాతలకు అలవోకగా కాసుల వర్షం కురిపిస్తున్నాయి.

దీనితో నిర్మాతలంతా నానితో సినిమా చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ తో మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో నాని నటించడానికి రంగం సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. ఈ కాంబినేషన్ గురించి ఇండస్ట్రీలో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఆ నిర్మాత చొరవతో నాని, త్రివిక్రమ్ కాంబినేషన్లో సినిమా చేయడానికి ప్రముఖ నిర్మాత డివివి దానయ్య సన్నాహకాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు దానయ్య.. త్రివిక్రమ్, నానితో సంప్రదింపులు జరుపుతున్నారట. ఆ సినిమాలని పక్కన పెట్టి మరీ ఈ కాంబినేషన్ ఒకే అయితే త్రివిక్రమ్ ఇప్పటికే కమిటై ఉన్న చిత్రాలకంటే ముందుగా ఈ చిత్రం ప్రారంభం అయ్యే అవకాశం ఉంది.

## సైజ్‌జీరో ఫిగర్ లేదు..



సెలబ్రిటీల వ్యక్తిగత జీవితంలోకి మీడియా ప్రవేశించడంపై గత కొద్దికాలంగా పలు రకాలు వ్యతిరేకత, నిరసన వ్యక్తమవుతున్నది. శ్రీదేవి మరణం నేపథ్యంలో బయటకు వచ్చిన సున్నితమైన అంశాలను ఛానెల్లు, వెబ్‌సైట్లు, ఇతర మీడియా బాగానే వినియోగించుకొన్నాయి.

శ్రీదేవి ఘటనపై మీడియా వ్యవహరించిన తీరును కొందరు బాహాటంగానే నిరసన తెలిపారు. తాజాగా మీడియా వైఖరిని సీనియర్ నటి, అక్కినేని నాగార్జున సతీమణి అమల అక్కినేని తీవ్రంగా దుయ్యబట్టారు. నా జీవితాన్ని స్వేచ్ఛగా ఆస్వాదించనివ్వండి అని అమల ఫేస్‌బుక్‌లో ఓ పోస్ట్ పెట్టారు. నా వయసుకు తగిన హెూదాను అనుభవించనివ్వండి. అలిసిపోయిన నా లుక్‌ను, పెరిగిన నా శరీర బరువుపై కామెంట్ చేయకుండా నా జీవితాన్ని సగర్వంగా సాగనివ్వండి. నా కళ్లద్దాల చాటు నుంచి కనిపించే కళ్ల కింద గీతలు నా వయసు గురించి ప్రతీరోజు గుర్తు చేస్తాయి అని అమల చెప్పారు.

సైజ్ జీరో ఫిగర్ లేదు నా ఆత్మగౌరవం దెబ్బ తినకుండా దస్తులు ధరించకుండా ఆపగలరా? నాకు సైజ్‌జీరో ఫిగర్ లేదు. నేను సీజన్ బట్టి దుస్తులు వేసుకొనే ఆసక్తి లేదు అని తన పోస్టులో అమల పేర్కొన్నారు. 19 ఏళ్ల వయసులో నా వయసుకూ, మనసుకు నచ్చిన పనులు నేను చేస్తాను. నా జుట్టుకు కలర్ వేసుకోవడాన్ని మీరు ఆపగలరా? 19 ఏళ్ల వయసులో పుష్పక్‌లో ధరించిన షార్ట్స్‌ను ధరించకుండా ఆపగలరా అని అమల తీవ్రంగా స్పందించారు.

## శ్రీదేవి ట్విట్టర్‌లో బోని కపూర్ ఎమోషనల్ ట్వీట్..


అతిలోక సుందరి శ్రీదేవి సినీ అభిమానుల గుండెల్లో అందమైన చరిత్రగా మిగిలిపోయింది. బుధవారం లక్షలాది మంది అభిమానులు, కుటుంబ సభ్యులు, ఆత్మీయుల నడుమ శ్రీదేవి అంత్య క్రియలు పూర్తయ్యాయి. శ్రీదేవి దుబాయ్ లో బాత్ టబ్ లో మరణించారనేది మాత్రమే అందరికి తెలిసిన విషయం. కానీ బాత్ టబ్ లో ఎలామరణించారు, అక్కడ జరిగిన సంఘటన ఏంటి వంటి విషయాలు రహస్యంగా మిగిలిపోయాయనేది కొందరి వాదన. ఏది ఏమైనా శ్రీదేవి మరణం తరువాత ఆమె భర్త బోనికపూర్ తొలిసారి స్పందించారు. అదికూడా శ్రీదేవి అధికారిక ట్విట్టర్ అకౌంట్ లోకి దూరి మరీ ఎమోషనల్ ట్వీట్ పెట్టారు. పలువురు సినీతారలు, సెలెబ్రిటీలు ప్రముఖుల మరణాలు ఇప్పటికీ అంతుచిక్కని రహస్యంగానే ఉన్నాయి. అదే జాబితాలో శ్రీదేవి మరణం కూడా చేరిపోయింది కొందరు అభిప్రాయ పడుతున్నారు. బాత్ టబ్ లో మరణించిందనే విషయం తప్ప శ్రీదేవి ఎలా మరణించిందని విషయాన్ని ఆమె కుటుంబ సభ్యులు సైతం నిర్ధారించలేదు. దుబాయ్‌లో జరిగింది హైడ్రామానేనా శ్రీదేవి మ ృతిపై దుబాయ్ లో పెద్ద హైడ్రామానే సాగింది. పోలీస్ ల ఎంక్వైరీ, పబ్లిక్ ప్రాసిక్యూషన్ విచారణ అంటూ పలు వార్తలు మీడియా సంస్థల్లో హల్ చల్ చేసాయి. వాటిలో నిజం లేకపోతే శ్రీదేవి మరణం గురించి అన్నిరకాలుగా



వార్తలు ఎలా పుట్టుకొస్తాయని వాదించేవారు లేకపోలేదు. సాఫీగా అతిలోక సుందరి అంత్యక్రియలు లక్షలాది మంది అభిమానులు, కుటుంబ సభ్యులు, బంధు మిత్రుల మధ్య శ్రీదేవి అంతిమ యాత్ర సాఫీగా జరిగింది. దుబాయ్ లో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో శ్రీదేవి చివరి మజిలీ సాఫీగా జరుగుతుందా అనే అనుమానాలు సగటు అభిమానుల్లో నెలకొని ఉన్నాయి. ఎట్టకేలకు దుబాయ్ పబ్లిక్ ప్రాసిక్యూషన్ శ్రీదేవి పార్థివ దేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించడంతో ఆందోళన వైదొలిగి, అభిమానులు ఆమెని కడసారి చూసుకునే అవకాశం కలిగింది.

## ఇంట్రడక్షన్ సీన్ రచ్చే..?

మెగా పవర్ స్టార్ రాంచరణ్ ప్రస్తుతం రంగస్థలం చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం విడుదలకు ముందే చరణ్ బోయపాటితో సినిమాని మొదలుపెట్టాడు. ఈ చిత్రానికి సంబందించిన లీకులు అప్పుడే మొదలయ్యాయి. రంగస్థలం చిత్రం ఈ నెల 30 న విడుదలకు సిద్ధం అవుతోంది. రంగస్థలం పై భారీ అంచనాలు ఉన్నాయి. మాస్ చిత్రాల దర్శకుడు బోయపాటి శ్రీనుతో చరణ్ తదుపతి చిత్రాన్ని చేయనుండడం విశేషం.బోయపాటి చిత్రంలో భారీ తారాగణం నటించబోతోంది. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ ఈ చిత్రంలో విలన్ గా నటిస్తున్నాడు. వివేక్ పాత్రకు సంబందించిన ఆసక్తికరమైన విషయం బయటకు వచ్చింది. రాంచరణ్ నటించిన రంగస్థలం చిత్రంపై భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. చరణ్ ఈ చిత్రంలో పల్లెటూరి యువకుడిగా, వినికిడి లోపం ఉన్న పాత్రలో మెప్పించేందుకు రెడీ అవుతున్నాడు. బోయపాటి సినిమా మొదలు రంగస్థలం చిత్ర విడుదలకు ముందే బోయపాటి సినిమాని రాంచరణ్ ప్రారంభించాడు. ప్రస్తుతం ఈ చిత్ర



షూటింగ్ జరుగుతోంది. 2017 లో కనిపించని చరణ్ 2016 లో విడుదలైన ధ ృవ చిత్రం తరువాత రాంచరణ్ మరో చిత్రంలో నటించలేదు. 2017 లో చరణ్ అభిమానులని నిరాశలే మిగిలింది. చరణ్ సినిమా ఏదీ గత ఏడాది విడుదల కాలేదు.

## ముక్కోణపు టోర్నీ...
# కీలక ఆటగాళ్లు దూరం



దిల్లీ: భారత్-శ్రీలంక-బంగ్లాదేశ్‌ల మధ్య మార్చి 6నుంచి ప్రారంభంకానున్న ముక్కోణపు టీ20 సిరీస్‌కు కీలక ఆటగాళ్లందరూ దూరం అవుతున్నారు. భవిష్యత్తులో కీలక టోర్నీలను దృష్టిలో పెట్టుకుని బీసీసీఐ కోహ్లీ, ధోనీ, పాండ్య, భువనేశ్వర్ తదితర ఆటగాళ్లకు విశ్రాంతినివ్వగా, గాయాల కారణంగా శ్రీలంక, బంగ్లాదేశ్ ఆటగాళ్లు దూరం కానున్నారు. తాజాగా బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబ్ అల్ హసన్ కూడా ముక్కోణపు టోర్నీకి దూరం అయ్యాడు. దీంతో జట్టు బాధ్యతలను మరో ఆటగాడికి అప్పగించనుంది బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు(బీసీబీ). గాయానికి చికిత్స కోసం థాయ్‌లాండ్ వెళ్లిన షకీబ్ శుక్రవారం తిరిగి స్వదేశానికి చేరుకోనున్నాడు. మరో వారం రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారట. దీంతో అతడు ముక్కోణపు సిరీస్‌కు దూరమవుతున్నట్లు బీసీబీ వర్గాలు తెలిపాయి.

రేపు సన్నాహక శిబిరం ముగించుకుని 4న బంగ్లా జట్టు లంకకు బయల్దేరనుంది. టోర్నీలో బంగ్లా జట్టు తన తొలి మ్యాచ్‌లో భారత్‌ను ఢీకొననుంది. టోర్నీలోని మొదటి మ్యాచ్ భారత్-శ్రీలంకల మధ్య మార్చి 6న జరగనుంది. టోర్నీలో పాల్గొనే మూడు జట్ల నుంచి కీలక ఆటగాళ్లు దూరం కావడంతో నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# స్విమ్మర్ ప్రశాంత్ కర్మాకర్‌పై మూడేళ్ల నిషేధం



దిల్లీ: పారా స్విమ్మర్ ప్రశాంత్ కర్మాకర్‌పై భారత ఒలింపిక్ కమిటీ వేటు వేసింది. దీంతో అతడు మూడేళ్లపాటు ఏ టోర్నీల్లో పాల్గొనేందుకు వీలు లేదు. అర్జెంటీనాలో జరిగిన ప్రపంచ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో పతకం సాధించిన ఏకైక భారతీయ ఆటగాడు ప్రశాంత్.

దేశానికి ఎన్నో పతకాలు తీసుకొచ్చిన ప్రశాంత్ 2016లో రియో పారాఒలింపిక్స్‌కు వెళ్లిన స్విమ్మింగ్ జట్టుకు కోచ్‌గా కూడా పని చేశాడు. ఇంతటి సీనియర్ ఆటగాడిపై భారత ఒలింపిక్ సంఘం వేటు వేయడానికి ప్రధాన కారణం అతని చేతలే. ఔను.. మహిళా స్విమ్మర్లు స్విమ్మింగ్ చేస్తుంటే ప్రశాంత్ వీడియోలు తీశాడు. విచారణలో ఇది నిజమని తేలడంతో ఒలింపిక్ సంఘం ఈ కఠిన నిర్ణయం తీసుకోవల్సి వచ్చింది. 2011లో అర్జున, 2015లో మేజర్ ధ్యాన్‌చంద్, 2014లో భీమ్ అవార్డులతో పాటు 2009, 2011లో స్విమ్మర్ ఆఫ్ ద ఇయర్‌గాను ప్రశాంత్ నిలిచాడు.

## ఆధ్యాత్మిక భావాన్ని అందరూ
# అలవర్చుకోవాలి

- బిజెపి నాయకుడు చొక్కాకుల వెంకటరావు
- అంగరంగ వైభవంగా అంతకాపల్లి ముత్యాలమ్మ పండగ

సబ్బవరం : నేటి ఆధునిక యుగంలో సాంకేతిక పరిజ్ఞానం పరిఢవిల్లుతున్న దశలో ఉరుకుల పరుగుల జీవితంలో అంతా మనఃశాంతి, సుఖసంతోషాలతో ఉండాలని, అందరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని బిజెపి నాయకుడు చొక్కాకుల వెంకటరావు పేర్కొన్నారు. అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లే అనే వేదోక్తి ప్రకారం ఆ తల్లి కరుణ పొందాలంటే భక్తిభావం తప్పక వుండాలని అన్నారు. దైవబలం ఉంటే ఏ కార్యక్రమాన్నైనా సాధించగలిగే ధైర్యాన్ని ఆ తల్లి ప్రసాదిస్తుందన్నారు. సబ్బవరం మండలం అంతకాపల్లి గ్రామంలో వెలసియున్న ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవమైన శ్రీ ముత్యాలమ్మ పండగ మహోత్సవం అంగరంగ వైభవంగా గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారు జామున 4 గంటల నుంచే ముత్యాలమ్మ గుడి వద్ద ఉత్తరాంధ్రలో అనేక ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు క్యూలో నిల్చొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి నాయకుడు





చొక్కాకుల వెంకటరావు , గ్రామ సర్పంచ్ చొక్కాకుల గోవింద్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



బుధవారం రాత్రి తొలేళ్ల పండగను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ కమిటీ వారు తీర్థ ప్రసాద వితరణ గావించారు. మంచినీరు, మజ్జిగ ఉచితంగా పంపిణీ చేశారు. చలువ పందిళ్లు వేయించారు.

**అమ్మవారి పండగ ప్రత్యేకత**

రావలమ్మపాలెం, ఒమ్మివానిపాలెం, అంతకాపల్లి ప్రజలు మత్స్య మాంసాలను పండగ చాటింపు నాటినుంచి తినరు. ఎందుకంటే ఈ అమ్మవారు స్వతహాగా బ్రాహ్మణ స్త్రీ. అందుచే భక్తులు మత్స్య మాంసాలు ముట్టరు. గురువారం సాయంత్రం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన అణుపు మహోత్సవంలో ఏనుగు, పూల రథం, గుర్రాలు రావులమ్మపాలెం నుండి అంతకాపల్లి శతకంపట్టుకు చేరుకుంటాయి. పూలరథం వెనుక భక్తులు తండోప తండాలుగా బయలుదేరి అమ్మవారిని దర్శించుకుంటారు. శతకంపట్టు వద్ద భక్తులు చుంచుబుడ్లు, మతాబులు, సీమటపాసులు తదితర మందుగుండు సామగ్రిని ఆనందోత్సాహాలతో వెలిగిస్తారు. ఈ వేడుక కన్నులపండువగా జరుగుతుంది.

ఈ వేడుకలలో మతాలకు, రాజకీయాలకు, కులాలకు, వర్ణాలకు అతీతంగా అందరూ పాల్గొని భక్తి శ్రద్ధలతో చిన్నాపెద్దా తేడా లేకుండా భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ చొక్కాకుల గోవింద్, ఉపసర్పంచ్ ఎం. మహాలక్ష్మినాయుడు, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, సబ్బవరపు నారాయణ మూర్తి, జిల్లా వీఆర్‌వోల సంఘం అధ్యక్షుడు సబ్బవరపు త్రినాధరామకాసు, రొంగలి దేముడు బాబు, ఎస్. దేముడు, ఎస్. అప్పారావు, గొంప రమణ, సబ్బవరపు నరసింహమూర్తి, గ్రామ పెద్దలు, ప్రజలు, భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

# హోలీ పండుగ



హోలీ పర్వదినం ప్రతి ఏటా ఫాల్గుణ మాసంలో వస్తుంది. ఇందుకు సంబంధించిన పురాణగాథను తెలుసుకుందాం. రాక్షసరాజైన హిరణ్యకశిపుని కుమారుడు ప్రహ్లాదుడు. నిత్యం విష్ణు నామస్మరణతో వున్న ప్రహ్లాదునిపై ఆగ్రహం పెంచుకున్నాడు హిరణ్యకశిపుడు. తన సోదరి హోలికను పిలిచి ప్రహ్లాదుడిని తీసుకొని అగ్నిప్రవేశం చేయమన్నాడు. ఆమెకు లభించిన వరం ప్రకారం ఆమెను అగ్ని ఏమీ చేయ్యేలేదు. అన్న ఆజ్ఞతో బాలుడన్న ఎలాంటి కనికరం లేకుండా హోలిక ప్రహ్లాదుడిని ఎత్తుకొని అగ్నిగుండంలోకి వెళుతుంది. అయితే తన భక్తులను ఎల్లవేళలా కనిపెట్టికునేవుండే ఆ పరమాత్ముడు మౌనంగా వుండగలడా? ఆ చిద్విలాసమూర్తి వెంటనే ప్రహ్లాదుడిని మంటలు తాకకుండా అనుగ్రహించారు. వెంటనే ప్రహ్లాదుడు సురక్షితంగా మంటలనుంచి బయటకువచ్చాడు. హోలిక మంటలకు ఆహుతై ప్రాణాలు విడిచింది. ఇక్కడ మీకో సందేహం రావచ్చు. హోలికకు వరముంది కదా అని. అయితే హోలిక ఒంటరిగా అగ్ని ప్రవేశం చేసినప్పుడు మాత్రమే ఆ వర ప్రభావముంటుంది. బాలకుడైన ప్రహ్లాదుడిని తీసుకొని మంటల్లో ప్రవేశించడంతో ఆ వరం ఫలించకుండా పోయింది. హోలిక చనిపోయిన దినాన్ని పురస్కరించుకొని హోలీ పండుగను నిర్వహిస్తారు.

చిన్ని కృష్ణుడు బాల్యంలో బృందావనం, గోకులంలో చేసిన కార్యాలను గుర్తు పెట్టుకునేందుకూ ఈ పర్వదినాన్ని రంగురంగులతో జరుపుకొంటారు. హోలీ సందర్భంగా కామదహనం కూడా నిర్వహిస్తారు. మన్మథుడిని పరమేశ్వరుడు భస్మం చేస్తాడు. అందుకే హోలీ రోజే కామదహనం కూడా నిర్వహించడం సంప్రదాయం.

# వెంటాడుతున్న ఫెడ్ భయాలు.. నష్టాల్లో సూచీలు

ముంబయి: దేశీయ మార్కెట్లను అమెరికా ఫెడ్ రేట్ల భయాలు వెంటాడుతున్నాయి. వడ్డీరేట్లు పెంచుతామని అమెరికా ఫెడ్ సంకేతాలివ్వడంతో వరుసగా మూడో రోజూ స్టాక్ మార్కెట్లు నష్టాల బాట పట్టాయి. దీనికి తోడు ఐటీ, బ్యాంకింగ్ రంగాల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీంతో గురువారం నాటి ట్రేడింగ్‌లో సూచీలు నష్టాలను చవిచూశాయి.

జీడీపీ సానుకూల ప్రభావంతో గురువారం ఉదయం లాభాలతో ట్రేడింగ్‌ను ఆరంభించినప్పటికీ.. అంతర్జాతీయ సంకేతాలతో మదుపర్లు అమ్మకాల వైపు మొగ్గు చూపడంతో సూచీలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఫలితంగా ఆరంభ లాభాలను కోల్పోయాయి. రోజులో చాలా సేపు ఊగిసలాడిన సూచీలు చివరకు నష్టాలను మూటగట్టుకున్నాయి. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 137 పాయింట్లు దిగజారి 34,047 వద్ద స్థిరపడింది. అటు నిఫ్టీ కూడా 34 పాయింట్లు కోల్పోయి 10,458 వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ.65.20గా కొనసాగుతోంది.

ఎన్ఎస్ఈలో భారత్ పెట్రోలియం, కోల్‌ఇండియా, అరబిందో ఫార్మా, ఇండస్‌ఇండ్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు లాభపడగా.. ఐసీఐసీఐ బ్యాంక్, వేదాంతా లిమిటెడ్, జీ ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎస్‌బీఐ, హిందాల్కో షేర్లు నష్టపోయాయి.




## రుణాలపై వడ్డీరేట్ల పెంపు
# ఎస్‌బిఐ తాజా నిర్ణయం

ముంబయి: అనుకున్నట్లే జరిగింది. ప్రభుత్వ రంగ అతిపెద్ద బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) రుణాలపై వడ్డీరేట్లను పెంచింది. డిపాజిట్ రేట్లను పెంచడంతో ఎస్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న నిధుల వ్యయ ఆధారిత రుణ రేటు(ఎంసీఎల్‌ఆర్) 7.95శాతాన్ని 8.15శాతానికి పెంచుతున్నట్లు ఎస్‌బీఐ గురువారం వెల్లడించింది. ఈ మేరకు బ్యాంక్ నుంచి నోటిఫికేషన్ వెలువడింది. కాగా.. 2016 ఏప్రిల్ తర్వాత ఎస్‌బీఐ రుణాలపై వడ్డీరేట్లను పెంచడం ఇదే తొలిసారి.

తక్కువ మొత్తం, భారీ మొత్తం డిపాజిట్ రేట్లను 0.75శాతం పెంచుతున్నట్లు ఎస్‌బీఐ బుధవారం వెల్లడించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం బ్యాంకు నిధుల వ్యయం ఆధారంగా రుణరేట్లను (ఎంసీఎల్‌ఆర్) నిర్ణయిస్తోంది. అంటే బ్యాంకు నిధులు సమీకరించే వ్యయం (డిపాజిట్ రేట్లు) ఏ మాత్రం పెరిగినా.. ఆ ప్రభావం రుణరేట్లపై కూడా పడుతుంది. బుధవారం డిపాజిట్ రేట్లను పెంచడంతో తాజాగా రుణ రేట్లను కూడా పెంచింది.

కాగా.. ఎస్‌బీఐతో పాటు మరో ప్రభుత్వ రంగ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కూడా రుణ రేట్లను పెంచింది. ప్రస్తుతం ఉన్న 8.15శాతం నుంచి 8.30శాతానికి పెంచుతున్నట్లు నిర్ణయం తీసుకుంది. ఈ బ్యాంకులు పెంచిన రుణరేట్లు మార్చి 1వ తేదీ నుంచే అమల్లోకి వచ్చాయి.

# విశాఖలో బీజేపీ కీలక సమావేశం 3న



విశాఖపట్నం : ఈనెల 3న విశాఖలో బీజేపీ నేతలు సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో ఏపీకి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకుంటారని సమాచారం. ఈ భేటీకి ఢిల్లీ నుంచి బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జ్ సతీష్‌జీ రానున్నారు. అంతేకాకుండా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకానున్నారు. ఏపీలోని తాజా రాజకీయ పరిస్థితులు, టీడీపీ వైఖరి, విభజన చట్టం హామీలు, కేంద్రం చేసిన సాయంపై చర్చించిస్తారు. ఇటీవల కర్నూలులో రాయలసీమ డిక్లరేషన్ పేరుతో బీజేపీ నేతలు కొన్ని తీర్మానాలు చేశారు. రాయలసీమలో రెండో రాజధాని, హైకోర్టు, గవర్నర్ తాత్కాలిక విడిది, సీఎం నివాసం ఏర్పాటు చేయాలని, రాయలసీమలో అసెంబ్లీ భవనం ఏర్పాటు చేయాలని నేతలు డిమాండ్ చేశారు. రాయలసీమలో 6 నెలలకోసారి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని, రాయలసీమ ప్రాజెక్టులకు బడ్జెట్‌లో రూ.20వేల కోట్లు, చేతి వృత్తిదారులకు 5 వేల రూపాయల కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలని బీజేపీ నేతలు డిమాండ్ చేసిన విషయం తెలిసిందే.

# హైకోర్టు న్యాయవాదుల ఆందోళన

హైదరాబాద్: తమ సమస్యల పరిష్కారం కోసం ఉమ్మడి హైకోర్టు న్యాయవాదులు అందోళన బాటపట్టారు. హైకోర్టు నుంచి పాతబస్తీలోని గుల్జార్‌హౌజ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. హైకోర్టు ఆరో గేటు నుంచి ప్రారంభమైన న్యాయవాదుల ర్యాలీ మదీనా మీదుగా గుల్జార్‌హౌజ్ వరకు చేరుకుంది. అక్కడ ప్రధాన రహదారిపై బైఠాయించిన న్యాయ వాదులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో నిరసన కార్యక్రమాన్ని చేపట్టిన న్యాయవాదులు ఉమ్మడి హైకోర్టులో ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com